


# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :13 సంచిక: 6 హైదరాబాద్ 2013 సెప్టెంబర్ పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com** **వార్షిక సభ్యత్వం : రూ. 100/-**

# ఆంధ్రుల అతిథి గృహం

మెహెరాబాద్‌లో ఆంధ్రుల అతిథి గృహం నిర్మించుకుని నాలుగు సంవత్సరాలు పైబడింది. ఎందరికో ముఖ్యంగా వయోవృద్ధులకు విశేష సేవలందిస్తోంది. అతిథి గృహానికి ప్రధానంగా రెండు విషయాలలో సోదర బాబా ప్రేమికుల నుండి సహాయం అర్థిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ వై.యస్.రావు ఒక ప్రకటనలో కోరారు.

**1. అతిథి గృహంలో స్వచ్ఛందంగా సహకరించేందుకు సహాయకులు**

**2. మంచినీటి కొరత తీర్చడానికై 'జలనిధి' కోసం ఆర్థిక సహాయం.**

అతిథి గృహంలో స్వచ్ఛందంగా ఏడాదిలో కనీసం నెల రోజులు పనిచేయడానికి ఇష్టపడేవారికి అర్హులైనవారికి తగినరీతిలో పారితోషికం కూడా అందించాలని భావిస్తున్నట్లు శ్రీ రావు తెలిపారు.

**అలాగే, 2వ అంతస్థులో క్రొత్తగా నిర్మించిన కాటేజీలలో ఒకటి ఖాళీగా అమ్మకానికి సిద్ధంగా ఉందని శ్రీ రావు తెలిపారు.**

మరిన్ని వివరాలకు శ్రీ వై.యస్.రావు ఫోన్ – **9011751910** సంప్రదించగలరు.

# ఎర్రని చిరునామాలు

## వివరణ

మెహెర్‌బాబా సంచికలను పోస్టుచేయడానికై ఉపయోగించే కవర్లు నీలం, ఎరుపు రంగులతో ప్రచురించడమైనది. **ఈ కవర్లుపై అతికించిన అడ్రస్ స్లిప్ మాత్రం ఎరుపురంగులో వుండిన పత్రిక సభ్యత్వ బకాయిదారులని గమనించవల్సింది.**

వార్షిక సభ్యత్వం చెల్లించని సభ్యుల చిరునామాలను ఎర్రని రంగులో హెచ్చరికగా పంపుతున్నాం. దయచేసి ఈ విషయాన్ని గమనించి తక్షణమే వారి వార్షిక సభ్యత్వం చెల్లించి సహకరించవల్సింది. అలాగే, జీవితసభ్యత్వంలో రూ 500 మాత్రమే చెల్లించినవారు కూడా వారి బాకీ నగదు రూ 500 వెంటనే చెల్లించవలెనని మనవి.

## హెల్ప్‌లైన్

మెహెర్‌బాబా పత్రికను ప్రతి నెలా 25వ తేదీ లోగా మీకు అందడంలో ఆలస్యమైతే శ్రీ వి. ఆర్. కె. శాస్త్రి, హైదరాబాద్ (98492-42284), లేదా శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ వార్షిక, జీవిత సభ్యత్వం సక్రమంగా చెల్లించి సహకరించవల్సింది.**

## బాబా సందేశం

అనేక ఆలోచనలకు, ఊహలకు కేంద్రం మనస్సు.

మనోనాశ్ అయితే కానీ భగవదైక్యం సాధ్యం కాదు.

**Union is possible only after the death of thoughts & imagination, the mind must die.**

**- Meher Baba**


**గౌరవ సంపాదకులు**

**మల్లాది కృష్ణానంద్**

**99595-53218,**

**krishnanandm@yahoo.com**

**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**

**దశిక ప్రసాదరావు**

**040-65699611**


## లోపలి పేజీలలో...


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | ప్రత్యేక శీర్షిక - మనోనాశ్ | 6-26 |
| 3. | లార్డ్ మెహెర్ | 27-33 |
| 4. | మా మాటలు | 34 |
| 5. | అవసరాలు - కోరికలు | 35-37 |
| 6. | ప్రార్థనలు | |



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**

ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# ఖోజాగూడా మనోనాశ్ గుహ

హైదరాబాద్ నగర శివార్లలో గల ఖోజాగూడా కొండ గుహ సమీపంలో 2013 అక్టోబరు 20 ఆదివారం ఉ. 10 నుండి మధ్యాహ్నం వరకూ ప్రత్యేక బాబా ప్రేమిక సత్సంగ్ నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ పి. రాజేంద్ర మెహెర్ తెలిపారు.

ఖోజాగూడ గుహలో అవతార్ మెహెర్‌బాబా 1951 అక్టోబరు 15 నుండి 24 దాకా నవజీవనంలో భాగంగా **మనోనాశ్** కార్యక్రమాన్ని నిర్వహించారన్న సంగతి పాఠకులకు తెలుసు.

అవతార్ మెహెర్‌బాబా జరిపిన మనోనాశ్ కార్యక్రమ దృష్ట్యా ప్రతి ఏడాది మనోనాశ్ వార్షికోత్సవం ఖోజాగూడా గుహ సమీపంలో నిర్వహిస్తున్నారు.

అత్యంత ఆధ్యాత్మిక విశేషత గల ఈ కార్యక్రమానికి బాబా ప్రేమికులందరూ తప్పక హాజరుకావాలని రాజేంద్ర మెహెర్ కోరారు.

**కోఠి బాబా సెంటర్ నుండి ఉ. 8 గంటలకు ఖోజాగూడా వెళ్ళేందుకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు.**

# జూబ్లీ సెంటర్ వార్షికోత్సవం

అవతార్ మెహెర్‌బాబా జూబ్లీ సెంటర్ వార్షికోత్సవం సందర్భంగా 2013 నవంబరు 17, ఆదివారం ఉ. 9 నుండి సా.5 గంటల వరకు ప్రత్యేక సత్సంగ్ కార్యక్రమం ఏర్పాటుచేశారు.

బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా శ్రీ రాజేంద్ర మెహెర్ ఒక ప్రకటనలో కోరారు.

# విజయనగరం సెంటర్

విజయనగరం సెంటర్ 33వ వార్షికోత్సవం 2013 అక్టోబరు 27న నిర్వహిస్తున్నట్లు సెంటర్ అధ్యక్షులు శ్రీ కొల్లి రామారావు (94403 98733) ఒక ప్రకటనలో తెలిపారు.

# విరాళం

శ్రీమతి బి.హెచ్. బాల సీతాదేవి, విజయవాడ మెహెర్‌బాబా పత్రిక నిర్వహణకై రూ. 1000 (వెయ్యి రూపాయలు) డొనేషన్‌గా పంపినారు. జైబాబా..

# <u>సంపాదకీయం</u> అడుసు

మనస్సు చాలా చంచలనమైంది. మనస్సు కోరికల పుట్ట.
మనస్సును చుట్టి వున్న సంస్కారాల ప్రభావం వల్లనే **నేను** పురుషుడిని, **నేను** స్త్రీని, **నా భార్య, నా భర్త, నా పిల్లలు** అనే ఆలోచనలకు కారణమని మెహెర్‌బాబా పలు సందర్భాలలో చాలా స్పష్టంగా చెప్పారు. మనస్సుని అదుపులో వుంచకపోతే ముని వ్రేళ్ళ మీద నిన్ను నాట్యం చేయిస్తుందని బాబా హెచ్చరించారు.
బురదలో చిక్కుకున్న కాలుని తీయబోతే, మరో కాలు ఇరుక్కుంటుంది కదా! అడుసు తొక్కనేల అన్నట్లు, మనస్సు మానవుల్ని అనేక ఇక్కట్లకు గురిచేస్తుంది, దాన్ని ఎంతగా నియంత్రించాలనుకుంటే అంతకన్ని రెట్లు దానిపట్ల ఆకర్షితులౌతారని బాబా అన్నారు. మనస్సు వున్నంత కాలం మీలో వున్న భగవంతుని దర్శించలేరన్నారు.
**నీలోని భగవంతుని దర్శనానికి నీకు – నీవే – గొప్ప అడ్డు తెర అని బాబా వ్యాఖ్యానించారు.**
మనస్సును శాశ్వతంగా తొలగించేందుకు ప్రయత్నించమన్నారు.
రాతి యుగం కన్నా పురాతనమైంది – మనస్సు అన్నారు.
మనస్సుకు చావు లేదు. మనస్సు– దాన్ని అంటిపెట్టుకుని వున్న సంస్కారాలు, వాటి ప్రభావం వల్లనే తిరిగి అనేక జన్మలెత్తుతూ, అనేక సంస్కారాలను మానవులు ప్రోదిచేసుకుంటున్నారని, ఈ సంస్కారాల మయాజాలం నుండి మానవుడు బయటపడాలంటే మనస్సు నాశనం కావాల్సిందేనని అన్నారు!
ఇదేమీ చెప్పినంత సులువు కాదు. అసాధ్యం అని కూడా బాబా శెలవిచ్చారు.
మనస్సును ఎవరు నాశనం చేయగలరు? అది తనంతట తానుగా నాశనం కావాల్సిందే!!
తేలు తన కొండెంతో కుడుతుంది. ఆ కొండాన్ని తెంపి వేస్తే, తేలు కుట్టినా నొప్పేమీ ఉండదు కదా అన్నారు. నిత్య జీవితంలో ఏ పని చేసినా **నేను** అనే భావన తొలగించుకోవడం ద్వారా కొంతమేర మానవులు మనస్సును అదుపులోపెట్టగల్గుతారన్నారు.
ధ్యానం, జ్ఞానం, నిస్వార్థసేవ, ప్రేమ, వంటి మార్గాల ద్వారా మనోనాశనం సాధించవచ్చుని బాబా పలుమార్లు తన ప్రవచనాలలో హెచ్చరించారు.

❀❀❀

హైదరాబాద్‌లోని ఖోజాగూడ కొండ గుహలో మెహెర్‌బాబా 1951 అక్టోబరు 15 నుండి 24 దాకా నవజీవనంలో భాగంగా **మనోనాశ్** కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఖోజాగూడ కొండ ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టతగల ప్రాంతం.
**ఖోజాగూడా కొండపై 2013 అక్టోబరు 20న నిర్వహిస్తున్న ప్రత్యేక సహవాస్‌కు వీలున్నవారందరూ తప్పక హాజరుకావాలనుకోవడం సంతోషం.**

❀

ప్రత్యేక వ్యాసం

# మనోనాశ్




**(గత సంచిక తరువాయి)**

అవతార్ మెహెర్‌బాబా హైదరాబాద్‌లోని ఖోజాగూడా కొండ ప్రాంతంలో 1951 అక్టోబరు 15 నుండి 24 దాకా నవజీవనంలో భాగంగా **ఏకాంతవాసం – మనోనాశ్** కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబావారు మనోనాశ్ చేపట్టిన ఖోజాగూడ కొండ ఆషామాషీ ప్రాంతం కాదు. ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టతవున్న ప్రాంతమిది. ఓ ప్రక్క దర్గా, మరో ప్రక్క గుడి దర్శనమిస్తాయి.

14వ శతాబ్దంలో నివసించిన హజరత్ బాబా ఫక్రుద్దీన్ సమాధి ఆ దర్గా.

ప్రతి ఏటా హైదరాబాద్ మెహెర్‌బాబా సెంటర్‌వారు ఇక్కడ అక్టోబరు నెలలో అవతారుడు జరిపిన మనోనాశ్ వార్షికోత్సవాన్ని వేడుకగా జరుపుతారు.

**ఈ ఏడాది 2013 అక్టోబరు 20న ఖోజాగూడా కొండపై ప్రత్యేక సహవాస్ ఉ.9 నుండి మ. ఒంటి గంట వరకూ నిర్వహిస్తున్నారు. కోఠి బాబా సెంటర్ నుండి ఖోజాగూడాకు ప్రత్యేక బస్సు ఉ. 8 గంటలకు నడుపుతున్నారు.**

ఈ సందర్భంగా ఖోజాగూడాలో మెహెర్‌బాబా నిర్వహించిన మనోనాశ్ కార్యక్రమ విశేషాలపై సమగ్రంగానూ, సంక్షిప్త సమాచారం మెహెర్‌బాబా పత్రిక పాఠకుల కోసం ప్రత్యేక శీర్షికగా గత నెలలో ప్రచురించడమైంది.

మిగిలిన భాగాన్ని ఈ సంచికలో సంపూర్ణంగా ప్రచురిస్తున్నాం.




అక్టోబరు మాసంలో ఖోజాగూడా గుహలో మెహెర్‌బాబా నిర్వహించిన
మనోనాశ్ కార్యక్రమ విశిష్టత దృష్ట్యా ఈ సంచికను మనోనాశ్ ప్రత్యేక సంచికగా రూపొందించాం. మాస పత్రికలోని అత్యధిక పుటలు మనోనాశ్ శీర్షికకే కేటాయించాం. పాఠకుల సౌలభ్యం కోసం తొలిసారిగా ఒక ప్రత్యేక శీర్షిక కోసం సుమారు 20 పేజీలు కేటాయించడమైంది.
బాబా ట్రస్టు చైర్మన్ శ్రీ భావూ కల్చూరీ వ్రాసిన
**"మెహెర్‌బాబా – నవజీవనం"** 700 పేజీల ఉద్గ్రంథం నుండి
అనేక ముఖ్యాంశాలు సేకరించడమైంది.
ముందుగా ఈ సమాచారాన్ని గత ఏడాది ఖోజాగూడా వార్షికోత్సవంలో
శ్రీ నోరి సూర్యనారాయణ మాకు అందజేశారు. ఇంగ్లీషులో వున్న ఆ సమాచారాన్ని తనదైన శైలిలో పాఠకులందరికీ అనువుగా శ్రీ మల్లాది రామారావు అనువదించి పంపారు.
మీ అమూల్య అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాం.
ఇకపై చదవండి!!

* * *

**హైదరాబాద్ అంటే తమకి ఎంతో ఇష్టం అన్నారు మెహెర్‌బాబా.**
ఆధ్యాత్మికంగా ఈ నగరం భాగ్యనగరమేనని శెలవిచ్చారు.
ఈ అదృష్టం ఇప్పటిది కాదు.
ఎన్నో యుగాలుగా సంప్రాప్తించిందీ భాగ్యం అన్నారు **బాబా.**
అందుకే కామోసు ఇక్కడ ఎక్కడచూసినా భగవదోన్మత్తులైన మస్తులు దర్శనమిచ్చారు బాబా మండలికి.




బాబావారు మనోనాశ్ చేపట్టిన ఖోజాగూడ కొండ కూడా ఆషామాషీ ప్రాంతం కాదు.
ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టతవున్న జాగా అది.
ఓ ప్రక్క దర్గా, మరో ప్రక్క గుడి దర్శనమిస్తాయి.
14వ శతాబ్దంలో నివసించిన హజరత్ బాబా ఫక్రుద్దీన్ సమాధి ఆ దర్గా.
ఇప్పటికీ ఎందరో ముస్లిమ్‌లు దర్గాని రోజూ దర్శించి తరిస్తుంటారు.
దర్గాకి నాలుగు ప్రక్కలా ప్రహరీ వుంది కానీ పైన గోపురం లేదు.
ఐనా ఎండా, వానలకి చెక్కు చెదరలేదు.
ఎందరో ప్రయత్నించారుట దర్గాపైన కప్పు వేద్దామని.
ఎన్నిసార్లు వేసినా, గాలి గట్టిగా వీయటం, కప్పు పడిపోవటం జరిగాయట.
ఈ దర్గాని ఆనుకొనే పెద్ద గుహ వుంది.
పెద్దది అంటే మరీ పెద్దది కాదు. 15×12 అడుగుల సైజు.
బాబావారు స్నానం చేసిందీ, విశ్రాంతి తీసుకొన్నదీ ఈ గుహలోనే.
అందుకు తగ్గ ఏర్పాట్లు చేసింది మన ఏరుచ్ గారు, పెండూ గారును.



కొండ కొంచెం దిగువున ఇంకో గుహ వుంది.
గుహ ద్వారం ఊరి వైపుకి లేదు.
అంటే గుహలో కూర్చొంటే, ఊళ్ళోవాళ్ళకి కనబడరు.
అందుకనే గుహకి తలుపు పెట్టించి, బాబావారి ఏకాంత కార్యక్రమానికి
ఇక్కడ వీలుకల్పించారు. ఈ రెండు గుహలకి దిగువున గుడి వుంది
ఇక్కడి ఇలవేల్పు విష్ణుమూర్తి. శేషతల్పంపై కన్పిస్తాడు ప్రభువు.
ఇంతకీ చెప్పేది ఏమంటే, అప్పట్లో ఖోజాగూడ అంతా రాళ్ళ మయం.
ఎక్కడ చూసినా పెద్ద పెద్ద బండరాళ్ళే. పచ్చని గడ్డిపోచ ఒకటీ లేదు.
కొండ క్రింద వరి పొలాలు, తాటిచెట్లున్నాయి.
అవి దాటితే ఊరు వుంది. కొండపైన మంచినీళ్ళు కావాలంటే,
క్రింద నుంచి తీసుకువెళ్ళాల్సిందే.
బండరాళ్ళ మధ్య, వర్షపు నీళ్ళగుంట వుంది కానీ బాగా పాచి పట్టిపోయింది.
ఆ నీళ్ళు త్రాగితే రోగాలు రావూ? ఈ మాటే ఏరుచ్ అంటే,
బాబావారు ఏమన్నారో తెలుసా? “ఆనీళ్ళనే కాచి, ఒడకట్టి త్రాగండి,
ఏమీకాదు” అన్నారు. హమ్మయ్య! అని ఏరుచ్, పెండూలు ఊపిరి పీల్చుకున్నారు.
ఈ కబుర్లకి తొందరేమి వచ్చింది, తర్వాత చెప్పుకోవచ్చు.
**మనోనాశ్ గురించి బాబావారేమన్నారో చెప్పమంటారా,** అయితే వినండి.
ఒకసారి కాదు చాలాసార్లు మనోనాశ్ గురించి బాబావారు సవివరంగా చెప్పారు.

మీకు అర్థం అవ్వాలని చెప్తున్నానంటూ
చాలా ఓపికగా చెప్పారు మనోనాశ్ అంటే ఏమిటో.
భూకంపం వచ్చిందనుకోండి, భూమి కదులుతుంది.
బీటలు తీస్తుంది. చెట్లు కూలిపోతాయి.
మంటలు రావచ్చు కూడా. ఇవన్నీ భూకంపం అనుకోవచ్చు.
ఇదే మనోనాశ్ విషయంలోనూ భావిస్తారు.
ఎవరికి తోచినట్లు వాళ్ళు అన్నారొకసారి.
స్వయంగా పరంధాముడై వుండి, సనాతుడనని అని స్వయంగా చెప్పిన
మెహెర్‌బాబా వారికి మనోనాశ్ అవసరం ఏమొచ్చింది?
ఈ ప్రశ్నకి తమదైన శైలిలో భావూ కల్చూరి గారి భాష్యం విన్నాం కదా.
మరి బాబావారేమన్నారో తెలుసుకోవాలని వుందా పాఠకమహాశయా అయితే వినండి.

* * *

జూన్ 30వ తేదీకి ఓ 75 మందిని హైదరాబాద్‌కి పిలిపించారు బాబావారు.
వారంతా 28 కల్లా వచ్చారు. వాళ్ళతో బాబావారు మూడు రోజులపాటు
అనేక సంగతులు మాట్లాడారు. అలా వచ్చిన వాళ్ళలో మన తెలుగు వాళ్ళు ఇద్దరున్నారు.
తోట ధనపతిరావు నాయుడు గారు, ఎ.సి.ఎస్. చారి గారు.
బాబా నామ ప్రచారంలో వీరిద్దరూ ఉద్దండులు అప్పటికే.
హమీర్‌పూర్ నుంచి కేశవనారాయణ్ నిగమ్, పుకార్‌లు వచ్చారు.
వీరందరికీ బాబావారిని చూడగానే, "అయ్యో, ఇదేమిటి,
బాబావారు ఇలా చిక్కిపోయారేమిటి? బాగా నీరసంగా వున్నారే" అనిపించింది.
శరీరం చిక్కి నీరసించినట్లున్నా మొహంలో మాత్రం అలసట కనబడలేదు,
సరికదా ఏదో గొప్ప ఆకర్షణ కనిపించింది.
అది ఇది అని ఇదమిద్ధంగా చెప్పలేకపోయారు.
ఎవరూ! ఏమోనబ్బా! వెయ్యి సూర్యులు ఒక్కసారే కన్పిస్తే ఎలా వుంటుందో
అలా వెలిగిపోతున్నారు బాబావారి నగుమోము అనుకొన్నారు.
వీరంతా సర్దుకు కూర్చున్నాక, బాబావారు తమ కార్యక్రమాల్ని చెప్పారు.
ఈ పని మీ కోసం, మానవాళి కోసం చేస్తున్నాను అనలేదు.
**నే చేపట్టున్న మనోనాశ్ కార్యక్రమం భగవదేచ్ఛ అన్నారు.**
ఇది భగవత్ నిర్దేశం. ఇంతకాలం ఏదైనా అవసరమొస్తే, ఆ పని ఎవరు
చేస్తారు, ఎలా చేస్తారు, వాళ్ళకి పని చేయగల సమర్థత వుందా?
అని బుర్రకి పని చెప్పేవాడిని. ఇహ ఇప్పుడు ఆ ఆలోచన లేదన్నారు.
దేముడు నిర్దేశించిన ప్రకారం, నా పని జరిగితే ఏమవుతుంది.

నాకు మీరు చేయాల్సిన పనంటూ ఏమీ వుండదు అన్నారు.
ఈ మాటలు అలనాటి ప్రేమిక లోకానికి అర్థమయ్యేయో లేదో కానీ,
ఈనాటి ప్రేమికలోకానికి కూడా అంతుచిక్కుతాయన్న నమ్మకం లేదు.
ఎందుకంటే, అది బాబా ఉవాచ.
**బహుశా అందుకనే హఫీజ్ సూక్తి ఒకటి చెప్పారు.**
**ఈ ఆత్మ పరమాత్మనైనా చేరాలి.**
**ఈ శరీరాన్ని వదిలయినా పోవాలి.**
**మరో మార్గం లేదంటాడు హఫీజు మహానుభావుడు.**
ఒకానొక సందర్భంలో తామున్న పరిస్థితీ అదేనన్నారు బాబావారు.
ఇంకో ఉదాహరణ ఇచ్చారు.
కుష్ఠు రోగికి చావు తప్పదని డాక్టరు చెప్పాడు.
ఏం చేస్తాడా నిర్భాగ్యుడు. చావు ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూస్తుంటాడు.
అవునా? చావు ఎలా వస్తుందో తెలీదు. ఎప్పుడు వస్తుందో తెలీదు.
సరే ఏం చేస్తాం. వస్తే రానీ అని మనస్సుని దిటవు చేసుకొంటాడు.
కొంతమంది నిరాశ, నిస్పృహలని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకొంటారు.
చావు ఏ సమస్యకీ పరిష్కారం కాదు అని అంటూ హఫీజు ఏమన్నారో
చెప్పింది ఇందుకనే అన్నారు.
రాత్రి నిద్రపోలేదు సరిగ్గా. మూడున్నరకే లేచి కూర్చొన్నా అన్నారు.
అప్పుడు అనిపించిందట తాము తిరుగులేని నిర్ణయం తీసుకోవాలన్నది.
భగవదేచ్ఛని స్పష్టంగా అనిపించిందిట. అంటే మనస్సు తేలిక పడిందట.
అమ్మో! ఏమవుతుందో అని లేదు. ఎక్కడో మనస్సులో అనిపిస్తోంది,
భగవంతుడు తప్పకుండా సహాయంచేస్తాడని. వచ్చే ఫిబ్రవరి 16 నాటికి మళ్ళా
నా పాత జీవిత స్థితి వస్తుంది, ఇందుకు దేముడు సాయపడతాడని
నా మనస్సు చెబుతోంది అన్నారు.
జూన్ 28న బాబావారి ప్రకటన ఘనీ గారు చదివారు.
భగవంతుడు నిర్ణయించిన ప్రకటన వివరాలు ఇవి అన్నాడు.
ముందు ఇంగ్లీషులో, హిందీలో ఆయన చదివితే,
మరాఠీ పాఠాన్ని దేశ్‌ముఖ్ గారు వినిపించారు.
3 పేరాల సుదీర్ఘ ప్రకటన అది. దాని సారాంశం ఏమిటి అంటే –
మనోనాశ్ కోసం నేను అడుగు వేయాలి. ఇది భగవంతుని కోరిక.
ముందడుగే తప్ప వెనక్కి తిరిగి చూడకూడదు. ఇదీ భగవంతుని నిర్ణయమేనని
నా మనస్సు చెప్తోంది. నేనిప్పుడు నవజీవనంలో వున్నాను.

నవజీవనంలో నేను సామన్య మానవుడి క్రింద లెక్క.
అక్టోబరు 16 నుండి మనోనాశ్ ప్రక్రియ మొదలవుతుంది.
ఫిబ్రవరి 16కి పూర్తవుతుంది. ఫిబ్రవరి 12 నాటికే మనోనాశ్ జరుగుతుంది.
భౌతికంగా సజీవంగానే వుంటాను. ఇందువల్ల ఏమౌతుంది.
ఏమవుతుందీ అంటే, నా పాతస్థితి – మెహెర్‌బాబా స్థితి వస్తుంది.
నా విశ్వ ప్రకటన జరుగుతుంది.
నాతో ముడిపడిన వాళ్ళకీ జీవితాల్లో అపూర్వ కాంతి వస్తుంది.
నాతో సంబంధం లేనివాళ్ళకి కూడా ఈ అనుభూతి దొరుకుతుంది.
అప్పుడేమి అవుతుంది. అందరితో ఒక్కడిని అవుతాను.
ఏ ప్రకారంగా? అది మీకు నాతోవున్న బంధం బట్టి వుంటుంది అని చెప్పారు.
ఈ మనోనాశ్ కాలంలో అన్ని బంధనాలకీ అతీతంగా వుంటామని స్పష్టం చేశారు.
దేశాటన చేయవచ్చు, బిక్షాటన చేయవచ్చు. ఎవరినైనా ఏదైనా అడగవచ్చు.
ఇచ్చింది పుచ్చుకోవచ్చు. తిరస్కరించినా తిరస్కరించవచ్చు.
ఇదీ అదీ చేయకుండా ఎక్కడో ఒకచోట స్థబ్దుగా కూర్చోవచ్చు.
ఏంచేయాలో జూలై – అక్టోబరుల మధ్య నిర్ణయిస్తాను అని శెలవిచ్చారు.
సందర్భాన్ని బట్టి ఏ పనైనా చేస్తాను. అది మంచిది కావచ్చు, చెడ్డది కావచ్చు.
గొప్పది కావచ్చు, చొప్పదంటు పని కావచ్చు.
నేనేపనిచేసినా, భగవంతుని యిచ్ఛ ప్రకారం, మనోనాశనం కోసం చేస్తాను అని ఘనీ, దేశ్‌ముఖ్‌లు చదివిన ప్రకటనలో బాబావారు స్పష్టం చేశారు.
అప్పుడు డాన్‌కిన్ మరో ప్రకటన ఇంగ్లీషులో చదివాడు.
దాని ఉర్దూ తర్జుమాని ఘనీ చదివితే, మరాఠీ ప్రతిని దేశ్‌ముఖ్ వినిపించాడు.
దాని సారాంశం కూడా ఇంతకుముందు చేసిన ప్రకటన వంటిదే.
అయితే ఇది చాలా క్లుప్తంగా రెండు మాటల్లో ముగించారు.
దేవుని ఎదుట, అన్ని యుగాల సద్గురువుల సాక్షిగా చెప్తున్నాను.
భగవంతుని ఇచ్ఛ ప్రకారం, దైవీ సాయంతో ఈ ఏడాది అక్టోబరు 16న మనోనాశనానికి నడుంకడతానని ప్రకటిస్తున్నాను అన్నారు.
తమ సమక్షంలో కూర్చొని వున్నవారందరినీ అక్టోబరు 16 ఉదయం ఎనిమిది నుంచి ఇరవై నాలుగు గంటలు ఉపవాసం వుండమన్నారు.
మంచినీళ్ళు త్రాగవచ్చు. మనస్సు అయితే టీ కూడా త్రాగండి అన్నారు.
మనోనాశ్ కాలంలో రోజులు ఎట్లా గడుస్తాయో చూచాయగా చెప్పారు.
ఈ వచ్చే నాలుగు నెలలు నాలుగు వందల చావుల క్రింద లెక్క అన్నారు.
మనోనాశ్ అంటే నాకు తెలుసు. భగవంతుడికి తెలుసు. మీరూ తెలుసుకోవాలి.

నే చెప్పింది శ్రద్ధగా వినండి. చెప్పింది అర్థం చేసుకోండి.
ఫిబ్రవరి 15 తర్వాత నేను వున్నా లేకపోయినా మీకు మంచి జరుగుతుంది
అని పేర్కొన్నారు. మనోనాశ్ అంటే ఏమిటో వివరించారు.
సంస్కారాల పుట్ట బుర్ర. అహంకారానికీ, మమకారానికీ బుర్ర పదునుపెడ్తుంది.
ఈ ముసుగులోంచి బయటపడాలి. ఇందుకు అనేక మార్గాలని సద్గురువులు చూపించారు.
మనస్సుకి వైరాగ్యం కల్గకుండా చేసే పనులున్నాయి.
అహంకారం పెంచే పనులూ వున్నాయి.
ఇందువల్ల సంస్కారాలు పెరుగుతాయి.
వీటి బారిన పడకుండా ఎలా తప్పించుకోవచ్చో సద్గురువులు చెప్పారు.
ఏమీ పట్టనట్లు ఏ పనైనా నిర్విప్తతతో పనిచేయడం, ధ్యానం,
మనసావాచా భగవంతుని ప్రేమించడం – ఆరాధించడం మూడు మార్గాలు.
అందువల్ల పాత సంస్కారాలు ఖర్చవుతాయి.
కొత్త సంస్కారాలు రావు.
సద్గురువులు చెప్పింది ఇదే. ఏ మార్గంలో వెళ్ళినా గమ్యం ఒక్కటే.
మనస్సుని తుడిచిపెట్టడం. మనస్సు వున్నంతకాలం శరీరం వుంటుంది.
సంస్కారాలు వస్తాయి. ఈ వలయం నుంచి బయటపడాలి అని చెప్తూ
తేలు కథ చెప్పారు. తేలు ఏం చేస్తుంది. కొండెంతో కాటేస్తుంది.
మరి ఆ కొండెంను కోసేస్తే ఏమవుతుంది? తేలు కుట్టినా నొప్పి పుట్టదు.
ఈ పనే చేయమన్నారు సద్గురువులు. ఏ పని చేసినా ఫలితం ఆశించకుండా
పని చేయండని చెప్పారు. కానీ నిస్వార్థంగా పని చేయగలరా అందరూ!
అహంకారం అడ్డం వస్తుంది. ఒక్క క్షణం కూడా నిస్వార్థంగా పని చేయనివ్వదు.
సేవలో జాలి పనికి రాదు. కానీ ఇలా చేయగలరా?
లేకపోతే ఫలితం వుండదు. మనోనాశనం అసాధ్యం.
రెండో మార్గం – భగవంతుడిపై భారం వేసి జీవించడం, సద్గురువుని సేవించడం.
ఎంత సేపు అంటే ఎల్లప్పుడూ. ఒక్క క్షణం కూడా సద్గురువుని సేవ వదలకూడదు.
అలా అయితే ఏపని చేసినా, సంస్కారాలు రావు.
కానీ ఇదీ చాలా కష్టం అని బాబావారు స్పష్టం చేశారు.
ఇహ మిగిలిన మార్గం మనోనాశనం సాధించిన వ్యక్తి ఆజ్ఞ మేరకి నడుచుకోవటం
కష్టమే. ఇదీ తేలిక కాదు. మనస్సుని అదుపులో పెట్టే మార్గం ఇంకోటి వుంది.
అది ధ్యాన మార్గం. ధ్యానం గట్టిగా చేస్తే మంచిదే. సంస్కారాలు హరించుకు పోతాయి.
కానీ ధ్యాన మార్గంలో కూడా పూర్తి మనోనాశ్ కష్టం.
ధ్యానం చేస్తూ సమాధిలోకి వెళ్ళితే వెళ్ళవచ్చు కానీ, సమాధి మత్తు

నల్లమందు మత్తు వంటిది. సమాధిలో వున్నంతసేపూ మనస్సు గెంతులు వేయదు.
కొత్త సంస్కారాలు ప్రోగు చేసుకోదు. ఇది సమాధి స్థితిలో వున్నంతసేపే.
సమాధి నుంచి బయటకి రాగానే మనస్సు పాత ధోరణిలోనే ప్రవర్తిస్తుంది.
ధ్యానంకు కూర్చొనే ముందు మీ చింత డబ్బు గురించి అనుకోండి.
సమాధి నుంచి బయటపడగానే మనస్సు డబ్బు పైకి పరుగెడ్తుంది అని అన్నారు.
భక్తి మార్గం గురించి వివరించారు. భక్తి, ప్రేమ నూటికి నూరుపాళ్ళు వుండాలి.
అప్పుడే మనస్సు దృష్టి దేనిపైనా పడదు, ఒక్క భగవంతుడిపై తప్ప.
కానీ నూటికి నూరుపాళ్ళు ప్రేమ కష్టం.
యాంత్రికంగా పూజా పునస్కారాలు చేసినా దండగే.
దైవ చింతనలో వందేళ్ళు గడిపేకంటే, సద్గురువుల సమక్షంలో క్షణం సేపు
వుండగలిగితే చాలు. కోర్కెలు చంపుకుంటూ శరీరాన్ని శుష్కింప చేసినా మంచిదే.
మనస్సుకి వూరట కలుగుతుంది. దేముడు కనిపిస్తాడు కానీ ఇందువల్ల కూడా
మనోనాశ్ పూర్తిగా జరగదు. అవతారులకైనా, ప్రవక్తలకైనా సరే
భగవంతుని దయ వుంటేనే మనోనాశ్ జరుగుతుంది అని బాబావారు స్పష్టం చేశారు.
అన్ని మార్గాలు మనోనాశ్‌కే దారితీస్తాయి.
నిస్వార్ధ సేవ, ధ్యానం, భక్తి,
శ్రద్ధగా – మనసావాచా చేస్తే మనస్సు గాడిలో పడుతుంది.
దేముడిని అంతటా చూడగలుగుతుంది. మనమందరం ఒక్కటే.
మనస్సు మనల్ని తప్పుదారిపట్టిస్తుంటుంది. ఆ మనస్సే పోతే, ఈ శరీరం పట్టదు.
ఈ శరీరంతో నాకు సంబంధం లేదనిపిస్తుంది. ఒక్క సర్వ స్వతంత్రుడైన
పరమాత్మకే చెల్లు మనోనాశనం కల్గించడం. ఒక్కళ్ళో ఇద్దరికో కాదు.
ఎంతమందికైనా ఒక్కసారే అ వరాన్ని ప్రసాదించగలిగింది భగవంతుడే.
మనోనాశనం తర్వాత కూడా కొంతమంది శరీరం వదలరు.
వాళ్ళ మనస్సులూ వాళ్ళ దగ్గరే వుంటాయి. ఎందుకంటే అటువంటివారి
శరీరం, మనస్సు, సంస్కారాలు అన్నీ భగవన్మయమే కాబట్టి.
అటువంటివారే సద్గురువులు.
**మనోనాశ్‌తో జ్ఞానం వస్తుంది. జ్ఞానం అంటే అహంబ్రహ్మాస్మి స్థితి.**
భగవంతుడు సర్వజ్ఞుడు. అందువల్ల ఆ అహంబ్రహ్మాస్మి స్థితి తృటిలో తెలుస్తుంది.
ఏమని! నీకు – తెలుసుకోవడానికి అప్పుడు – ఇప్పుడు ఏమీ లేదని.
అది ఏ పేరుపెట్టి పిలిచినా ఒక్కటే అని. అది అంతంలేని స్థితి.
అనంత సత్యస్థితి అని వివరించారు.
కాసేపయ్యాక నానాఖేర్ బాబావారిని ఓ కోరిక కోరాడు.

మీ దగ్గరే వుండాలని వుందన్నాడు. నానా నాగపూర్ నివాసి, బ్రాహ్మణుడు.
నేను చెప్పినట్లు చేస్తావా? అని బాబా అడిగారు. నానా బుర్ర ఊపాడు.
అయితే రేపటి నుంచి రెండు సీసాల సారా త్రాగు. రెండు శేర్ల మాంసం తిను అన్నారు బాబా. పాపం అతగాడు జీవితంలో ఇంత వరకు మధువు, మాంసం ముట్టుకోలేదు.
అయితేనేం, తడుముకోలేదు. మీరు చెప్పినట్లే చేస్తా బాబా అన్నాడు.
ప్రభువు సంతోషించారు.
ఆ మాటే చెప్పారు నానాకి.
మీ ఇంటి దగ్గరే వుండు, ప్రస్తుతానికి, మధువు, మాంసం ముట్టకు అని హెచ్చరించారు.
నేను మీ దగ్గరే వుంటాను అంటూ పంకరాజ్ వచ్చారు.
నువ్వు నా దగ్గర వుంటే, నీ భార్య తారాబాయి దెబ్బలాటకి వస్తుంది నాతో అని బాబా పరాచకమాడారు. మా ఆవిడ గొడవ చేయదు బాబా అన్నాడతడు.
అయితే ఓ పనిచేయి. మీ ఊరు నాగపూర్ వెళ్ళిపో, రెండు నెలలు రోజూ వేశ్యా గృహానికి వెళ్ళు. రోజూ సారా త్రాగు ఓ సీసాడు. అలా చేస్తానంటే నా దగ్గర వుండనిస్తానన్నారు బాబా. పంకరాజ్ తటపటాయించాడు.
ఆలోచించి చెప్తా జవాబు అన్నాడు. ఆలోచించేవాడు ఏపనీ చేయలేడు.
వెళ్ళు, నీ భార్యతోనే వుండు. వ్యభిచారుల దగ్గరకు మాత్రం వెళ్లకు, సారా ముట్టకు అని హితవు చెప్పారు బాబా.
జూన్ 30వ తేదీన బాబా అందర్నీ ఉస్మాన్‌సాగర్‌కి తీసుకువెళ్ళారు.
చార్మినార్ చూపించారు. తిరిగి వచ్చాక, అందరికీ ప్రసాదం ప్యాకెట్లు ఇచ్చారు.
ఇంటికి వెళ్ళే వరకూ ఈ పొట్లాలు విప్పవద్దు. ఇంటికి వెళ్ళాక మీ వాళ్ళకి పెట్టి, మీరు తినండి అని చెప్పారు. ఒక్క రేణువు కూడా వృధా చేయకండి అని హెచ్చరించారు.
మనోనాశ్ సాధించడానికి తమకి నాలుగు నెలల వ్యవధి వుందన్నారు.
భగవంతుని దయవల్ల లక్ష్యం చేరతానన్న పూర్తి నమ్మకం వుందన్నారు.
మీరు నా కోసం ప్రార్థించండి అన్నారు. తమతో ఎవరు కదిలి వస్తారు అని ప్రశ్నించారు.
అందరూ ఒక్కసారి చెతులెత్తారు. అందరూ మొగ మహారాజులే.
కొంతమందితో మీకు సంసారాలు, బాధ్యతలు లేవా? అన్నీ వదలి నాతో రాగలుగుతారా అని తరచి తరచి ప్రశ్నించాక, ఆరుగురిని ఎంపిక చేశారు.
పెండూ, ఏరుచ్, బైదుల్, గుస్తాద్, మెనూ ఖరస్, దౌలత్ సింగ్‌లు ఆ అదృష్టవంతులు. ప్రస్తుతానికి పెండూ, ఏరుచ్, బైదుల్, గుస్తాద్‌ల పేర్లు ఖరారు చేశారు. మిగిలిన వాళ్ళని సెప్టెంబరు 7న ఎంపిక చేస్తానన్నారు.
అలసిపోయాను, కాస్తంత నవ్వించండి అన్నారు.
ఘనీ పఠాన్ వేషం వేసుకువచ్చాడు. అతన్ని చూసి అందరూ నవ్వారు.

సేవక్ కోత్వాల్ డాన్సు చేశాడు. నలభయి ఏళ్ళు పైబడ్డా డాన్సు స్టెప్పులు జబర్దస్తీగా వేశాడు. కేశవ్ నారాయణ్ నిగమ్ చీరకట్టుకొని బాబాకేసి ఓరకంట చూస్తూ నడిచాడు. పెద్ద ఆదీ తండ్రి టెలిఫోన్‌లో మాట్లాడే పద్ధతిని రుస్తుం అనుకరిస్తుంటే అందరూ కడుపుబ్బ నవ్వారు. ధాకేపాల్కర్ టైలర్ వేషంలో వచ్చాడు. అతను షేర్వాణికి కొలతలు తీసుకొన్న పద్ధతి బాబావారికి కూడా నవ్వు తెప్పించింది.

అలా ఆ ప్రకారం జూన్ నెలపై తెరపడింది.

బాబావారి పిలుపుపై వచ్చిన వాళ్ళు వెనుతిరిగారు.

బాబావారి వెంట నవజీవనం చేస్తున్న ఇరవై మందీ హైదరాబాద్‌లోనే వున్నారు.

అక్టోబరులో కదా మనోనాశ్ మొదలయ్యేది. వీరందరిలోకీ చిన్నవాడు మురళీకాలే. 1927లో మెహెరాశ్రమంలో చేరినప్పటినుంచీ బాబావారి దగ్గరే వుంటున్నాడు. హోమియోపతి చదవాలనిపించింది. ఆమాటే చెప్పాడు బాబావారితో.

కాలేది జబల్పూరు. కుర్రాడు ఇంటికి వస్తే బాగుండునని అతని వదినకి వుంది. ఆమె పేరు నిర్మల. పెద్దదాన్నయ్యాను. ఒంటరిగా వుంటున్నాను. నా దగ్గరకి మురళిని పంపించు బాబా అని ఆమె చాలాసార్లు అడిగింది. ఇప్పుడు మురళి కూడా చదువుకోవాలని వుంది అనటంతో, బాబావారు సరేనన్నారు.

ఓప్రక్క మనోనాశ్ ఏర్పాట్లు జరుగుతుంటే, మణి, మెహెరూలని ఆస్పత్రిలో చేర్చాల్సి వచ్చింది. మణికి హిస్టరెక్టమీ ఆపరేషన్ చేశారు.

మెహెరూకి ఎపండిక్స్ ఆపరేషన్ జరిగింది.

నవజీవనంలో బాబావారు, మండలివారు మాసిపోయిన బట్టలతో చూడటానికి దొంగల్లా, గూండాల్లా కన్పిస్తున్నారు. ఇన్ని రోజులు ఇబ్బంది రాలేదు. ఎందుకంటే జాల్ కేరావాలా అందరికీ గుర్తింపు పత్రాలు ఇప్పించాడు. ఇవి హైదరాబాద్‌లో పనికిరావన్నారు.

హైదరాబాద్ నుంచి ఔరంగాబాద్ పోతున్నా కష్టం అవుతుంది. దారిలో పోలీసులే ఆపవచ్చు.

బాబాకీ మాటచెప్పి, హైదరాబాద్ పోలీసు కమీషనర్‌ని కలిశాడు ఏరుచ్. మా పెద్దన్నయ్యకి ఇబ్బంది లేకుండా మీ పోలీసులకి చెప్పండి అని అడిగాడు. ఆ పెద్దాయనకి బాబా రాక గురించి తెలియకపోతే కదా.

నిఘా పోలీసులు ఆ సంగతి ఎప్పుడో చెప్పారు.

బాబావారితో కలిసి, పూనా సైంట్ విన్సెంట్ హైస్కూల్లో చదివిన సంగతి గుర్తుకువచ్చింది. అంతే ఏరుచ్‌ని తన ఇంటికి తీసుకువెళ్ళి మర్యాద చేశాడు ఆ పోలీస్ బాస్. బాబావారితో చిన్నపుడు తీయించుకొన్న క్రికెట్ జట్టు ఫోటో చూపించాడు.

మా నిజాం రాజ్యంలో పోలీసులు వేధించరని బాబావారికి చెప్పమన్నాడు.
బాబావారు సంతోషించారు. ఆగష్టు 20న పూనా నుంచి చావు కబురు వచ్చింది.
ఘనీ గారు గుండెపోటుతో కన్నుమూశారు. అరవై ఏళ్ళు ఆయనకి.
ఘనీ విలక్షణమైన వ్యక్తి అని బాబా శ్లాఘించారు.
అతని ఆకస్మిక మృతి తీరని లోటన్నారు.
స్నేహితుడే కాదు నా పనికి ఓ సాధనం అన్నారు.
అక్టోబరు దగ్గర పడుతుంటే బాబావారు బైదుల్‌కీ, ఏరుచ్‌కీ పెండూకీ పనిపెట్టారు.
మనోనాశ్‌కి అనువైన గుహ వెతకమన్నారు. ఇక్కడ కొండలు జాస్తిగా వున్నాయి కదా.
స్థానికులు ఎవరైనా దారి చూపకపోతారా అనుకొన్నారు ఆ ముగ్గురూ.
మార్కెట్టుకి వెళ్ళారు. చాపలు కుడ్తున్న వ్యక్తి తారసపడ్డాడు.
ఇక్కడ దగ్గర్లో గుహలు ఏమైనా వున్నాయా అని అడిగారు.
రండి చూపిస్తానన్నాడా వ్యక్తి. అలా ఖోజాగూడా గుహ దొరికింది.
బాబావారికి చూపించారు. ఆయనకీ నచ్చింది.
పైన దర్గా క్రింద గుడి, మధ్యలో గుహ. నా పని ఇక్కడ పూర్తవవచ్చు. కాకనూపోవచ్చు.
అయితేనేం ఇది బాగుంది. ఇక్కడ రెండు వారాలు వుంటానన్నారు.
వాసుదేవ్ కైన్‌కి కబురు పంపారు. గుడి, మసీదు, చర్చి, బౌద్ధ స్థూపం, అగ్నికుండం
బొమ్మలు చేయించమన్నారు. ఒక్కొక్కటీ ఏడు అంగుళాల ఎత్తు వుండాలి అని చెప్పారు.
వీటిని ఆగ్రాలో చేయించి పంపాడు కైన్. ఈ బొమ్మల్ని కొండపైకి తీసుకువెళ్ళమని
బాబావారు అక్టోబరు 13న చెప్పారు. ఎవరికి? ఇంకెవరికి – ఏరుచ్, బైదుల్, గుస్తాద్,
పెండూలకి. బాబావారి ఏకాంతవాసానికి అవసరమైన సరుకు సరంజామానీ వెంటనే
చేర్చమన్నారు. వాళ్ళు చెప్పినట్టే చేశారు. కానీ ఓ గమ్మత్తు జరిగింది.
ముందు సామాన్లు పైకి చేర్చాక బొమ్మల్ని తీసుకువెళ్ళాలనుకున్నాడు ఏరుచ్.
అందుకని బొమ్మల్ని కారులోనే వుంచి తాళం వేసి కొండ ఎక్కుతుంటే,
కారు వెనక్కి దొర్లుతూ కనిపించింది. ఏరుచ్ కారు వెనుక లంఘించాడు.
చక్రం అటు తిరిగినా ఇటు తిరిగినా లోయలో పడుతుంది.
అలా కాలేదు సరికదా వెళ్ళి వెళ్ళి కొండ క్రింద పంట పొలాల్లో దిగబడింది.
బొమ్మలు పగిలి వుంటాయని భయపడ్డాడు ఏరుచ్.
కారు తలుపు తెరిచి చూస్తే, బొమ్మలు చెక్కు చెదరకుండా కనిపించాయి.
హమ్మయ్య అని ఊపిరి తీసుకొన్నాడు. ఇంటికి తిరిగివెళ్ళాక, ఈ సంగతి బాబావారికి
చెపితే, ఆయన పకపకా నవ్వారు. ఇదీ మంచి శకునం నా మనోనాశ్ పనికి అన్నారు.
స్త్రీమండలికి ఖోజాగూడా మనోనాశ్ కొండగుహ చూపించారు.
చాలా బాగుందీ ప్రాంతం అన్నారు వాళ్ళు.

అక్టోబరు 15వ తేదీ మధ్యాహ్నం బాబావారు ఖోజాగూడాకి బయలుదేరారు.
బాబావారి కారుని చక్కగా అలంకరించారు.
డాన్‌కిన్ డ్రైవరు.
విష్ణు, నీలు, ఓ మౌల్వీ (మహమ్మదీయుల పూజారి) వెంట కదిలారు.
దౌలత్ సింగ్ అప్పటికే కొండపైన వున్నాడు.
బాబావారి కారు ఖోజాగూడా చేరేసరికి మూడు అయింది.
చిరుజల్లు పడుతోంది.
మౌల్వీ గారు ప్రార్ధనతో బాబావారి మనోనాశ్ మొదలైంది.
విష్ణు, నీలు, డాన్‌కిన్ వెనక్కిమళ్ళారు. విష్ణు, నీలూలని గుడికి వెళ్ళి పూజలు చేయమన్నారు బాబా. డాన్‌కిన్ చర్చికి వెళ్ళమన్నారు. కైకోబాద్‌ని అగ్ని దేవాలయానికి వెళ్ళమని చెప్పారు. మౌల్వీని మసీదుకు వెళ్ళమన్నారు. సాయంకాలం అయ్యేసరికి చిరుజల్లు కాస్తా భారీ వర్షం అయింది. మర్నాడు అక్టోబరు 16వ తేది.
ఆవాళ్టికి నవజీవనం మొదలై రెండేళ్ళయింది. ఏరుచ్, పెండూ, గుస్తాద్, బైదుల్, దౌలత్ సింగ్‌లని మర్నాటి ఉదయం ఎనిమిది వరకు ఉపవాసం వుండమన్నారు. గత ఆరు అవతార మూర్తులని కీర్తించమన్నారు. బాబావారు చెప్పినట్లు ఏరుచ్ ప్రార్ధన ఐదుసార్లు గట్టిగా చేశాడు.
ఓ ప్రభువా! నేటి నుంచి చేపడుతున్న నాలుగు నెలల కార్యక్రమానికి చేయూతని ఇవ్వమని మెహెర్‌బాబా నిన్ను కోరుతున్నారు.
ఇచ్ఛ పూర్తి అయ్యేలా దీవించమని సవినయంగా
అర్థిస్తున్నారు అని ఏరుచ్ మనసా ప్రార్థించాడు.
ఓ ప్రక్క వర్షం పడుతున్నా బాబావారు పట్టించుకోలేదు.
కైన్ పంపిన ఐదు బొమ్మల్ని తీసుకొని దర్గాలోకి వెళ్ళారు.
ఏడు గంటలు ఏకాంతంగా వున్నారు. ఏరుచ్ ప్రభుతులు దర్గా బయట కాపలావున్నారు.
**అలా మొదలైంది మనోనాశ్ కార్యక్రమం.**
18వ తేదీన కాసేపు విశ్రాంతి తీసుకొని, గుహలోకి వెళ్ళారు.
ఐదు మతాల పూజామందిరాల నమూనాలని గుహ అంచున పెట్టించారు.
ఏకాంతవాసం ఏడు గంటలు సాగింది మళ్ళీ.
19వ తేదీన విష్ణుమాస్టర్ గుడిలో మూడు గంటలు ఏకాంతంగా కూర్చొన్నాడు.
22వ తేదీ మధ్యాహ్నం గులామ్ హుస్సేన్ అన్న మస్తుతో పనిచేశారు.
అతడిని బైదుల్ తీసుకువచ్చాడు.
24వ తేదీన తమ ఏకాంతవాసం పరిసమాప్తమయిందన్నారు.
అలా రెండు వారాలు అనుకొన్న కార్యక్రమం తొమ్మిదిరోజుల్లోనే ముగిసింది.

**మనోనాశ్ మలిదశ**

24వ తేదీన బాబావారు హైదరాబాద్ నుంచి ఔరంగాబాద్ దారి పట్టారు.
వెంట ఏరుచ్, బైదుల్, పెండూ, దౌలత్‌సింగ్ కదిలారు.
స్త్రీ మండలికి బాబా కబురు పంపారు.
నేను బాగున్నాను.
గుహలో నా పని సజావుగా వంద శాతం జరిగింది.
ఔరంగాబాద్ మీదుగా మెహెరాజాద్‌కి బయలుదేరాను.
మీరు అక్కడికి రండి. మెహెరాజాద్‌లో నేను స్థిరపడుతున్నానని అనుకోకండని చెప్పారు స్త్రీ మండలికి. పాద్రీకి టెలిగ్రామ్ పంపారు. మెహెరాజాద్ దగ్గరి తెంబి కొండపై క్యాబిన్‌కి కొన్ని మార్పులు చేయమన్నారు. కొండ అంచున రెండు టెంట్లు వేయించు. నాతో వచ్చేవారు వుండటానికి అని చెప్పారు.
మెదటిరోజు ఏడుమైళ్ళు నడిచి లింగంపల్లిలో ఆ రాత్రి గడిపారు.
మర్నాడు ఉదయం ఇంకో ఐదు మైళ్ళు నడిచి పటాన్‌చెరువు చేరారు.
అక్కడి వరకు బాబా బృందం సామాన్లు ఎడ్లబండిలో వచ్చాయి.
ఇక్కడ బండికి ఉద్వాసన చెప్పారు. దీంతో నలుగురి భుజాన పడ్డాయి పెట్టెలు, పరుపుల చుట్టలు. జోగిపేటలో మస్తు వున్నాడని విని, అక్కడికి బస్సులో వెళ్ళారు.
ఎంత వెతికినా కనబడలేదు ఆ మహానుభావుడు.
ఇహ లాభం లేదని రోడ్డునపడ్డారు. రాత్రికి సంగారెడ్డి చేరారు.
మర్నాడు ఉదయాన్నే సదాశివపేటకి బస్సులో వెళ్ళారు. అక్కడ మస్తు కనిపించాడు. బాబావారు సంతోషించారు. 27వ తేదీన మళ్ళీ బస్సు ఎక్కి హుస్నాబాద్ చేరారు. అక్కడో సాధువు తారసపడ్డాడు. అక్కడి నుంచి 12 మైళ్ళు వెళ్ళగానే గౌలీవాడ దగ్గర ఓ గొప్ప మస్తు కనిపించాడు. ఇంకో ఇద్దరు మస్తుల్ని కలిసి, మధ్యాహ్నానికి హుస్నాబాద్‌కి తిరిగివచ్చారు. మానిక్ ప్రభువు అన్న సాధువు సమాధి దగ్గర కాసేపు కూర్చొన్నారు బాబా. ఇలా గుల్బర్గా, తుముకూరు, యాదగిరి, తుల్జాపూర్, ఉస్మానాబాద్, భీడ్, ఖుల్దాబాద్‌ల మీదగా ఔరంగాబాద్ చేరారు. మొత్తం దూరం కాలినడకన చేయలేదు.
గుస్తాద్ గారు నీరసంగా వున్నాడు. నడిచే ఓపిక లేదు.
అందుకని వీలయనప్పుడు బస్సు, లేకపోతే ట్రక్కు ఎక్కేవారు.
రైలు ప్రయాణం చేశారు. దారిలో మస్తుల్ని కలిసారు.
ఒకచోట 101 మంది నిరుపేదలకి తలో 50 రూపాయలు ఇచ్చారు.
వారికి పాదాభివందనం చేశారు. తుముకూర్‌లో తిలగిరి స్వామి అన్న జీవన్ముక్తుడిని కలిశారు. నవంబరు రెండున భీడ్ చేరారు.
అక్కడ ముగ్గురు మస్తుల్నీ, ఒక సాధువుని బాబావారు కలిశారు.

ఈ ఊరు దాటితే నిజాం రాజ్యం నుంచి మహారాష్ట్రలో అడుగుపెట్టినట్లే.
మనోనాశ్ ఆఖరి దశని మహారాష్ట్రలో పూర్తిచేయాలన్నది బాబావారి సంకల్పం.
నవంబరు 15 వరకు ఖుల్దాబాద్‌లో బాబావారున్నారు.
ఇక్కడికి గతంలో బాబావారు ప్రాక్ పశ్చిమ శిష్యులతో వచ్చారు.
13, 14 శతాబ్దాలలో సూఫీ సంస్కృతికి ఖుల్దాబాద్ పట్టుకొమ్మ.
ఇక్కడ 14 వందల ఋషుల సమాధులున్నాయి.
అప్పటి సత్పురుషుల్లో జర్జారిజర్ బక్షీ చెప్పుకోదగ్గ వ్యక్తి.
నాలుగు అడుగుల ఎత్తు, ఎనిమిది అడుగుల వెడల్పు, 15 అడుగుల లోతున్న
ఓ గుహలో బాబావారు ఏకాంతంగా చాలాసేపు కూర్చున్నారు.
సాయిబాబా పదహారేళ్ళప్పుడు ఈ గుహలో రెండున్నర ఏళ్ళ ధ్యానం చేశారని చెప్పారు.
ఆ ధ్యానం పూర్తవుతూనే సాయిబాబాకి దైవ సాక్షాత్కారం లభించిందని,
సద్గురువు అయ్యాడని బాబా అన్నారు. నవంబరు 22న బాబావారు ఎల్లోరా గుహలకి వెళ్ళారు. అక్కడ 32వ గుహలో మహావీరుని విగ్రహం ముందు కూర్చున్నారు. ఒక్కరే అక్కడ చాలాసేపున్నారు. విరోద్ అన్న ఊరు వెళ్ళి ప్రల్హాద్ కేశవ్ మహారాజ్ అన్న మస్తుల్ని కలిశారు. నవంబరు 14న జర్జారిజర్ బక్షీ సమాధి దగ్గర 75 మంది స్థానిక ముస్లిమ్‌ల పాదాలు కడిగి తుడిచారు. తలో 10 రూపాయల దక్షిణ ఇచ్చారు.
సమాధి కాపలా వ్యక్తికి కూడా పాదం కడిగి, శిరస్సు వంచారు.
21 రూపాయలు చేతిలోపెట్టారు.
స్థానిక హిందువు ఒకాయన్ని వెంటపెట్టుకొని హిందువుల ఇళ్ళకి బిక్షాటనకి వెళ్ళారు.
ఏది ఇస్తే అది తీసుకొన్నారు. 24 మంది హిందువులకి పాదాభివందనం చేసి
తలో పది రూపాయలు ఇచ్చారు. ఆ వేళ మొత్తం వెయ్యి రూపాయలు పంచిపెట్టారు.
ఖుల్దాబాద్‌లో వుండగానే పశ్చాతాప ప్రార్థలను ప్రసాదించారు.
పాత, కొత్త, ప్రస్తుతకాలాల సద్గురువులని స్మరిస్తూ చెప్పిన ప్రార్థన అది.
బాబావారే స్వయంగా పఠించారీ ప్రార్థనను.
నవంబరు 15న బాబా బృందం ఔరంగాబాద్ చేరింది. ఖుల్దాబాద్ నుంచి
15 మైళ్ళు ఈ వూరు. కాథలిక్ గురువు నెవరినైనా కలవాలని వుందన్నారు.
కొంచెం వయస్సు మళ్ళినవారైతే మంచిది. ఆశీస్సులు తీసుకొంటాను అన్నారు.
ఏరుచ్‌ని వెంటబెట్టుకొని కాథలిక్ ఫాదర్ కోసం బయలుదేరారు.
చూడగానే నువ్వు గుర్తుపడతావని ఏరుచ్‌కి చెప్పారు.
ఊరంతా గాలించగా గాలించగా, బాబావారు కోరిన క్రైస్తవ మత పెద్ద కనిపించాడు.
బాబా మోకరిల్లి పాదాల్ని తాకారు.
క్రైస్తవుల పద్ధతిలో చేతిని ముద్దుపెట్టుకొన్నారు.

ఆ పెద్ద బాబావారిని మనసారా ఆశీర్వదించారు.
నవంబరు 23 వరకూ ఔరంగాబాద్‌లోనే బాబా వారున్నారు.
ఆ చుట్టుప్రక్కల చాలామంది మస్తుల్ని కలిసారు.
ఒకమస్తు చిన్న కుర్రాడు. ఒంటిపై బట్టలేదు.
జాల్నా వెళ్ళి అక్కడ ఛల్లేవాలా బాబాని కలిశారు.
వుంగరాలు సాధువు అని పిలుస్తారతన్ని అందరూ.
చేతినిండా వుంగరాలే ఆయనకి. నవంబరు 18న నాందేడ్ వెళ్ళి
అక్కడి గురుద్వారా దర్శించారు. సిక్కుల పదవ గురువు గురుగోవిందసాబ్
ఇక్కడే సమాధి అయ్యారు.
సిక్కుల పవిత్ర గ్రంధం – **గురు గ్రంథసాహెబ్** ఆయన ప్రసాదమే.
మెహెరాజాద్‌కి వాపసు వెళ్ళమని హైదరాబాద్‌లోని స్త్రీమండలికి బాబావారు
టెలిగ్రామ్ పంపారు. నవంబరు 21న బయలుదేరమని చెప్పారు.
స్త్రీమండలినీ, పురుష మండలినీ పెద్ద ఆదీ రెండు కార్లలో నగర్‌కి
వాపసు తీసుకువెళ్ళాడు.
దౌలత్ సింగ్‌కి జ్వరం వచ్చింది.
బెంగుళూరు వాపసు వెళ్ళు, నీ భార్యా పిల్లలు శ్రద్ధగా చూస్తారు
నిన్ను అని బాబావారు అనటం, అతను బెంగుళూరు దారి పట్టడం జరిగాయి.
నవంబరు 21న బాబా, పెండూ, ఏరుచ్, గుస్తాద్, బైదుల్ ఔరంగాబాద్
నుంచి బయలుదేరారు. ఆ రాత్రి ఇమామ్‌పూర్‌లో స్థానిక మసీదులో
పడుకున్నారు. మర్నాడు ఉదయం తొమ్మిదింటికి మెహెరాజాద్
దారిపట్టారు. మెహెరాజాద్ పొలిమేరలు చేరేసరికి మధ్యాహ్నం అవుతోంది.
తెంబీ కొండ దానిపైన ఆజ్బెస్టాస్ రేకుల గది దూరాన్నుంచి కన్పిస్తున్నాయి.
పొలాల్లో నుంచి అడ్డంగా నడుస్తూ బాబా కొండ దగ్గరకి చేరారు.
అప్పటికే అక్కడికి వచ్చిన మెహెరా, మణీలని పలకరించారు.
ఆలింగనం ఇచ్చారు. కొండపైన ఏకాంతవాసం చేస్తానని చెప్పారు.
రోజూ ఉదయాన్నే టీ పంపండి ఫ్లాస్కులో. పాలు కలపకండి అన్నారు.
కొండకేసి చూడకండి అన్నారు. మిగతా స్త్రీమండలికి కూడా చెప్పండీ
సంగతి అన్నారు. మెహెరా, మణి, వెళ్ళిన కాసేపటికి పురుష మండలి
వచ్చి బాబాని కలిశారు. అప్పటికే బాబా కొండపై ఎక్కారు.
బాబావారు చెప్పినట్లుగా కొండపైన ఒకటీ, 30 అడుగుల దూరంలో
కొండకి దిగువున మరోకటి మొత్తం రెండు క్యాబిన్లని పాద్రీ పెట్టించాడు.
తలుపు, కిటికీ అమర్చాడు వాటికి.

రెండో క్యాబిన్ దగ్గరగా చిన్న షెడ్ వేశాడు.
బాబా వెంట వచ్చిన మండలివారు ఉండటానికి ఇందులో ఏర్పాట్లు చేశాడు.
క్రింద క్యాబిన్‌లో బాబావారు పగలు ఉండేవారు. రాత్రి కొండపై క్యాబిన్‌కి వెళ్ళేవారు.
హైదరాబాద్‌కి క్రైన్ పంపిన ఐదు మతాల ప్రార్థనా మందిరాల నమూనాలని క్రింది క్యాబిన్‌లో పెట్టారు.
ఇదే దరిమిలా మనోనాశ్ క్యాబిన్‌గా ప్రసిద్ధికి ఎక్కింది.
నవంబరు 24న మెహెరా, మణీ కొండపైకి వచ్చారు.
బాబావారి పిలుపుపైనే వచ్చారనుకోండి.
నా పని తృప్తిగా వుంది. కానీ మాయ అడ్డాలు పెడుతోంది అన్నారు.
అడ్డాలు ఏమిటో ఆ వేళే తెలిసింది అందరికీ. పురుష మండలి షెడ్ దగ్గర చప్పుడు. తమ ఏకాగ్రతకి భంగం కల్గిస్తోందన్నారు.
ఒకరాత్రి బాగా వర్షం పడింది. బాబావారి క్యాబిన్‌లో నీళ్ళు కారాయి.
షెడ్‌లో పురుష మండలివారైతే పూర్తిగా తడిసి ముద్దయ్యారు.
పాద్రీని పిలిస్తే, రిపేర్లు రెండు రోజులు చేశాడు.
ఆ రెండు రోజులు బాబావారు బ్లూ బస్సు ప్రక్క గదిలో గడిపారు.
మెహెరాకి చెప్పారు అప్పుడు 1951 అక్టోబరు 16 నుంచి నలభై రోజులపాటు చేసిన పని తృప్తిగా వుంది. ఇంకా 80 రోజుల పని మిగిలింది.
ఇది చాలా ఉత్కృష్టమైన పని అని మెహెరాకి చెప్పారు బాబా.
నవంబరు 27న బాబావారు ఏకాంతవాస కొండపైకి వాపసు వచ్చారు.
డిసెంబరు ఒకటి నుంచి నాలుగు రోజులు ఉపవాసం వున్నారు.
ఈ నాలుగు రోజులు మంచినీళ్ళు తప్ప ఇంకేమీ తీసుకోలేదు.
ఇంకో మూడు రోజులు నిమ్మరసంపై వున్నారు.
పంచదార కలిపిన నిమ్మరసం తీసుకొన్నారు.
చలి పెరిగింది. ఈదురు గాలులు ఎక్కువయ్యాయి.
ఆ గాలికి హాలులో బాబావారు చప్పట్లు కొడితే షెడ్‌లో వున్న మండలివారికి వినబడటం లేదు. అంతే రెండు క్యాబిన్లని మెహెరాజాద్‌కి మార్పించారు.
రెంటినీ కలిపి పెద్ద క్యాబిన్ చేయమన్నారు.
ఆ పనిని పాద్రీ డిసెంబరు 13కి పూర్తిచేశాడు.
అప్పటి వరకూ బాబావారు ఇంజన్ గదిలో వున్నారు.
ఇది బ్లూ బస్సు ప్రక్కనే వుంది.
బైదుల్ థానే నుంచి పథాన్ బాబా అన్న మస్తుని తీసుకువచ్చాడు.
తమ క్యాబిన్‌లో జాగా ఇచ్చారతనికి.

రెండు వారాలున్నాడతను. ఏరుచ్, బైదుల్, గుస్తాద్, పెండూ మాత్రం కొండపైనే వుంటున్నారు. రాత్రి చలికి వణుకుతున్నారు. పగలు ఎండకి మాడిపోతున్నారు. వీళ్ళకి భోజనం పంపమని మెహెరూ దమనియాకి పురమాయించారు బాబా. ఈమె ఎవరో కాదు, ఏరుచ్ సోదరి. ఆరోగ్యం బాగా లేకపోయినా, ఓపిక చేసుకొని రోజూ భోజనం పంపేది. ఇంతకీ ఈమె ఎక్కడుంది? ఇప్పటి ట్రస్టు ఆఫీసు ఇంటిలో వుండేది.

డిసెంబరు 14న కొండపై వారికి కొండ దిగిరమ్మని పిలుపు వెళ్ళింది. ఆ వేళ నుంచి మనోనాశ్ ఆఖరి దశ మొదలైంది. నగర్ నుంచి మౌల్వీని పిలిపించారు. బాబావారి సమక్షంలో ఖురాను పఠించాడు. ఓ అరగంటసేపు జరిగిందీ ఖురాను పాఠం.

మర్నాడు ఉదయం 9 గంటలకి, ఐదు మతాల ప్రార్థనలు జరిగాయి. హిందూ మతం, బౌద్ధ మతం, క్రైస్తవ మతం, జొరాస్ట్రియను మతం, ఇస్లామ్ మతం ప్రార్థనలని ఆయా మతాల ఫోటోలు, ప్రార్థనా మందిరాల నమూనాలని బాబావారి ముందు బల్లపై పెట్టారు. ముస్లిమ్ ప్రార్థనలు జరుగుతుంటే, బాబాజాన్ ఫోటో అక్కడ వుంచారు. గురుద్వారా ఫోటో కూడా తెప్పించారు.

తమ కార్యక్రమ సాఫల్యానికని భగవంతుని ప్రార్థించమని బైదుల్‌కి బాబా చెప్పారు. అతను పర్షియన్ భాషలో ప్రార్థన చేశాడు. ఈవేళ్టి నుంచి తొమ్మిది రోజులు రోజూ ప్రార్థన చేయమని కైకోబాద్ గుస్తాద్‌లకు బాబావారు చెప్పారు. రోజూ మస్తులని తెప్పించే పని బైదుల్‌పై పడింది.

డిసెంబరు 24న బాబావారు ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. మరణించిన తమ ఆత్మీయుల కోసం ఈ ప్రార్థనలు అన్నారు. మొత్తం 124 మంది జాబితాని పెద్ద ఆదీ తయారుచేశాడు. బాబావారి తండ్రి, తల్లి, పేర్లు ఈ జాబితాలో వున్నాయి. మొత్తం 87 మంది పురుషులు, 37 మంది స్త్రీలకి శ్రద్ధాంజలి ఘటించిన బాబావారు, నిరుపేద పాదాలకి మొక్కి, 124 రూపాయలు చేతిలో పెట్టారు. నవజీవనంలో బాబావారి వెంట వున్నవారందరికీ భగవంతుడు దివ్యానుభూతిని కల్గించుగాక అని ఏరుచ్ మరో ప్రార్థన చదివాడు. ఇంకో నిరుపేద పాదాలకి మ్రొక్కి బాబావారు 51 రూపాయలు చేతిలో పెట్టారు. స్వర్గవాసులైన మరో పదకొండు మంది గుర్తుకు వచ్చారు. వాళ్ళకీ శ్రద్ధాంజలి ఘటించారు. మెహెరాజాద్‌లో పనివాడిని పిలిచి అతని పాదాలకి పదకొండుసార్లు మొక్కారు. పదకొండు రూపాయలు చేతిలో వుంచారు.

ఇంకో ముగ్గురి పేర్లు గుర్తుకువచ్చాయి.

ఈసారి మెహెరాబాద్‌లో ఊద్నే కుర్రాడిని పిలిపించాడు.
మూడుసార్లు అతని పాదాలకి మొక్కారు.
మూడు రూపాయలు ఇచ్చారు దక్షిణగా.
ఈ ప్రార్థనా కార్యక్రమాలు పూర్తి అయ్యాక బాబావారు మనోనాశ్ క్యాబిన్ నుంచి బయటకి వచ్చారు. మేడపై తమ గదిలో మూడు రోజులున్నారు.
డిసెంబరు 25న మెహెరా పుట్టినరోజును బాబా ఘనంగా జరిపారు.
నెల రోజులపాటు అంటే జనవరి నెలాఖరు వరకూ రోజూ 7 నుంచి 11 గంటల వరకూ మనోనాశ్ పని చేశారు. అడపాదడపా బ్లూ బస్సులో కూర్చొనేవారు.
అప్పుడప్పుడూ మనోనాశ్ క్యాబిన్ బయటకి వచ్చి తమ నవజీవనపు కబుర్లు మండలివారితో చెప్పేవారు. ఒక్కోసారి ఏరుచ్‌ని తమ గదికి పిలిపించి, వివిధ మత గ్రంథాలని చదవమనేవారు. గ్రామఫోను పెట్టుకొని పాటలు వినేవారు.
బైదుల్ మస్తులని తెచ్చేవాడు. పంకరాజ్, గుస్తాద్ గారి తమ్ముడు శ్లామ్‌సన్ ఇంకా కొందరు కూడా మస్తులని తెచ్చేవారు. బాబావారు మస్తులతో కాసేపు ఏకాంతంగా కూర్చొనేవారు. స్నానంచేయించి, కొత్త బట్టలు ఇచ్చి పంపేసేవారు.
జనవరి నాలుగు రాత్రి ధుని వెలిగించారు. తెల్లవార్లూ వెలుగుతూనే వుంది.
ఉదయాన్నే ఆ మంటనార్పేయమన్నారు. ఆ వేళ్టి నుంచి మనోనాశ్ పూర్తి అయ్యేవరకూ రోజూ సాయంత్రం ధుని వెలిగించడం రివాజు అయింది.
జనవరి 23వ తేదీన బాబావారి సమక్షంలో గుస్తాద్‌జీ ధుని వెలిగించారు.
భగవంతుడి నూటొక్క నామాలని జపించమని బాబా కైకోబాద్‌కి చెప్పారు.
ఆ నామజపం అయ్యాక, "అహూ రమజ్దా" అని గట్టిగా ఏడుసార్లు అన్నారు కైకోబాద్, కాకాబారియా, పెండూ, పాద్రీలు ఓమ్ పరబ్రహ్మ పరమాత్మ అని ఎలుగెత్తి పిలిచారు.
"ఓ ప్రభువా, స్వర్గంలోని తండ్రి" అని ఏరుచ్, "లా ఇలా హ ఇల్లిల్లాహ" అని బైదుల్ ఏడుసార్లు అన్నారు. అప్పుడు బాబావారు ధునికి నమస్కరించారు.
ఈ అయిదుగురికీ నమస్కరించారు. ధుని దగ్గర ఒంటరిగా కూర్చొన్నారు.
మళ్ళా వాళ్ళని రమ్మని పిలిచి, భగవన్నామస్మరణ చేయించారు.
జనవరి 23 నుంచి 30వ తేదీ వరకు మనోనాశ్ క్యాబిన్‌లోనూ, బ్లూ బస్సులోను గడిపారు. బాబావారు బాగా అలసిపోయారు.
మొహంలో అలసట స్పష్టంగా కన్పిస్తోంది.
జనవరి 31 ఉదయాన్నే స్నానం చేశారు. ఏడు నుంచి ఎనిమిది వరకూ ఏకాంతంగా వున్నారు. కాకాబారియాకీ, కైకోబాద్‌కి పిలుపు వెళ్ళింది.
తమకి చెరో ప్రక్కనా కూర్చోమన్నారు. ఓ అరగంట సేపు "అహూరమజ్దా" నామస్మరణ చేయించారు. వాళ్ళు వెళ్ళాక ఓ అరగంట ఒంటరిగా కూర్చున్నారు.

నీలూనీ, విష్ణునీ "పరబ్రహ్మ, పరమాత్మ" స్మరణ చేయమన్నారు.
అరగంట జరిగిందీ నామస్మరణ. ఓ అరగంట విరామం ఇచ్చి, పాద్రీని పిలిస్తే,
అతను "యాయజ్‌దాన్" అన్నాడు అరగంట సేపు.
ఏరుచ్‌ని పిలిచి, నే చెప్పింది కాగితంపై రాయమన్నారు.
అతను చెప్పినట్లే చేశాడు. ఆ కాగితం మడతపెట్టి జేబులో పెట్టుకున్నారు.
సాయంకాలం ధుని వెలిగించినప్పుడు ఆ కాగితం చదవాలి అని చెప్పారు.
భోజనానంతరం, ఏరుచ్ చేత సూఫీ సాహిత్యం చదివించారు.
మళ్ళా ప్రొద్దుటిలాగా, వివిధ మత రీతుల్లో భగవన్నామస్మరణ చేయించారు.
ఓ గంట ఏకాంతంగా గడిపారు. సూర్యుడు అస్తమిస్తుంటే, క్యాబిన్ బయటకి వచ్చారు.
ధునికేసి నడిచారు. ధుని వెలిగించారు. మంట రాజుకోసాగింది. మంటలు పైకి
ఎగసిపడుతుంటే, నిలబడి చేతులు జోడించి ధునికి నమస్కరించారు.
మండలివారినీ అలాగే చేయమన్నారు. జేబులో నుంచి ఓ కాగితం తీసి,
ఏరుచ్‌కి ఇచ్చి చదవమన్నారు. "పూజలు, పునస్కారాలు, క్రతువులు అన్నీ ఇప్పుడు
అగ్నికి ఆహుతి అవుతున్నాయి" ఇదీ ఆ కాగితంలో వ్రాసిన వాక్యం.
ఏరుచ్ ఆ వాక్యం చదవటంతోనే, బాబావారు ఆ కాగితాన్ని తీసుకొని, ముక్కలు ముక్కలుగా
చింపి, మంటల్లో పడేశారు. అందరూ ధుని దగ్గర చతికలబడ్డారు.
కాసేపయ్యాక అందర్నీ నిలబడమన్నారు. ప్రొద్దుట ఏరుచ్ వ్రాసిన కాగితం ఇచ్చి
చదవమన్నారు. నవజీవనంలో, మనోనాశ కాలంలో ఆచరించిన పూజల నుంచి
విముక్తుడినవుతున్నాను నేటి నుంచి. దేవాది దేవా అనంత జ్ఞాన నిధీ!
నేను ఇప్పుడున్న సామాన్య స్థితిలో నేను చేయగల్గినదల్లా నేను చేశాను.
ఇది నీకు తెలుసు. ఫలితం నీ చేతిలో వుంది. ఈ క్షణం నుంచి ఫిబ్రవరి 16 వరకూ
నాకు మార్గదర్శకుడివి నీవే – ఇలా సాగింది ఆ ప్రార్థన.
ధునిలో వేసిన చక్క ముక్కలు పూర్తిగా కాలిపోయేవరకు ఎవరూ మాట్లాడలేదు.
ఆ బూడిదని ఎవరూ ముట్టుకోకూడదని బాబా ఆదేశించారు.
ధునిపై మూత పెట్టించారు. అందరికీ ప్రసాదం పెట్టారు.
ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకి బాబావారు మనోనాశ్ క్యాబిన్ నుంచి
బయటకి అడుగుపెట్టారు. నలభై రోజుల ఏకాంతవాసం ముగిసింది ఈవాళ్టితో.
బాబా గదిలో నుంచి బయటకి వస్తుంటే నీలూ, ఓమ్ పరబ్రహ్మ, పరమాత్మ అని గట్టిగా
అన్నాడు. మిగిలిన అందరూ గొంతు కలిపారు. ఇలా చేయమని బాబావారే చెప్పారు
ఎప్పుడో. బాబావారు ధునిలో బూడిదని రెండు పెద్ద డబ్బాలల్లో నింపారు.
జాగ్రత్తగా వుంచండీ డబ్బాలని అన్నారు. ఒక్కో డబ్బా పెద్ద బండరాయి అంత బరువుగా
వున్నాయిట. ఈ బూడిదని వాడకండి అని బాబావారు స్పష్టం చేశారు.

దరిమిలా రోజుల్లో, రెండు డబ్బాలని ఎగువ మెహెరాబాద్‌కి పంపారు.
అక్కడ వాటిని నీళ్ళ ట్యాంకి గదిలో వుంచారు.
ఫిబ్రవరి ఆరవ తేదీ ఉదయం ఆలీషా కోసం కబురు పంపారు.
మెహెరాబాద్ నుంచి అతను వచ్చాడు. స్నానం చేయించారు.
అతనితో ఏకాంతంగా పనిచేశారు. వాపసు పంపేశారతన్ని.
కాసేపయ్యాక, బాబావారొక మాట అన్నారు.
నేటితో నా మనోనాశ్ పూర్తయింది అన్నారు.
నవజీవనం కూడా పరిసమాప్తి అయిందన్నారు.
ప్రేమికలోకానికి శుభవార్త పంపారు.
ప్రతిచోట ఉన్నది భగవంతుడు, ప్రతిదీ చేసేది భగవంతుడు, మనలో ఉన్నదీ భగవంతుడు,
సర్వం తెలిసిందీ భగవంతునికే. మన బయటవున్నది, అన్నీ చూస్తున్నది దేవుడే.
మనకి ఆవల వున్నది అన్నింటా వున్నదీ భగవంతుడే సర్వాంతర్యామి. సర్వ శక్తిమయుడు.
నా మనోనాశ్ కార్యక్రమాన్ని నడిపించాడు అని బాబావారు పేర్కొన్నారు.
మనోనాశ్ విశిష్టతని వివరించారు.
మనోనాశ్ అనిర్వచనీయమైన అద్భుత స్థితి.
ద్వంద్వత్వం పోయి ఏకత్వం వచ్చిన స్థితి ఇది.
అజ్ఞానం పోయి, జ్ఞానం సంక్రమించిన సుమధుర స్థితి.
బంధనాలు తెగిపోయి స్వేచ్ఛ సంప్రాప్తమయిన దశ మనోనాశ్ అన్నారు.
గత నాలుగు నెలలుగా మనోనాశనం కోసం శాయశక్తులా పాటుపడ్డానన్నారు.
చేసిన పని తృప్తినిచ్చింది.
ఈ తృప్తి ఎందుకు?
ఎందుకు అంటే నా పూర్వపు మెహెర్‌బాబా స్థితిని తిరిగి పొందగలిగినందుకు.
నవజీవనపు సామాన్య మానవ స్థితిని నిలబెట్టుకోగలగినందుకు కూడా
తృప్తిగా వుంది అన్నారు. జ్ఞానం, శక్తి, గొప్పతనం – ఇవి నా పాత జీవితం సొత్తు.
ఇవి తిరిగి పొందాను.
అజ్ఞానం, బలహీనత, అణుకువ – ఇవీ నవజీవనపు విశిష్టతలు,
ఇవీ నావెంటనే వున్నాయి.
ఈ పాత్ర కొత్తల కలియిక జీవితానికి ప్రాణంపోసింది.
అనంత ప్రాచీనమైనదీ జీవితం.
అనంత అధునాతనమైనది కూడా ఈ జీవితం.
ఈ పాత కొత్తల కలయిక వల్ల జీవితానికి విశిష్టత వచ్చింది అన్నారు.
జైబాబా



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,**
**వాల్యూం-4 (1929 మే నుండి) - తెలుగుసేత: మల్లాది రామారావ్,**
**న్యూఢిల్లీ**

***(గత సంచిక తరువాయి)***

అహ్మద్ ఖాన్, జమ్‌షెడ్‌లని మెహెరాబాద్‌లో వుండమన్నారు.
ఐదుగురిని అక్బర్ ప్రెస్ (సాథా నివాసం)లో వుంచారు.
మిగిలిన పిల్లల్ని ఇళ్ళకి పంపారు.
ఇలా, జూలై తొమ్మిది నుంచి పిల్లల ఆశ్రమం మూత పడింది.
తాత్కాలికంగానే సుమా!
దేశాటన ముగించుకొని బాబావారు మెహెరాబాద్ వాపసువచ్చే వరకే కదా
ఈ ఏర్పాట్లు అన్నీ.
బాబావారి ప్రయాణపు ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి.
ఎక్కడికెక్కడికి వెళ్లేదీ జూలై మొదటి వారంలోనే ఖరారయింది.
ఈ యాత్ర బస్సులో చేస్తామన్నారు బాబా.
తమకు ఎటువంటి బస్సు కావాలో చెప్పారు.
బస్సు ఏర్పాటు చేసే పని పాద్రీకి అప్పగించారు.
సరే బాబావారు కోరిన ప్రకారంగా కొత్త బస్సు దొరకదు.
ట్రక్కు ఛాసిస్ కాని, బస్సు బాడీ కట్టించాలి.
బొంబాయిలో అయితే ఈ పని తేలిక.
అందుకని జూలై 2వ తేదీన పాద్రీ బొంబాయి బయలుదేరాడు.
టన్ను బరువు మోయగల కొత్త షెవర్లే ట్రక్కు ఛాసిస్ కొంటాను.
దానిపై బాబావారు కోరిన హంగులతో బస్సు కట్టిస్తానన్నాడు.
ఈ బస్సుకు నీవే డ్రైవరువి అన్నారు బాబా.
మహద్భాగ్యం అన్నాడు పాద్రి.
అలా పాద్రి బొంబాయి దారి పట్టిన మూడురోజులకి
అంటే జూలై 5వ తేదీన వసంత్ ఏడుస్తూ వచ్చాడు.
అమ్మా, నాన్నల కళ్ళు కప్పి,
జామ్‌ఖేడ్ నుంచి పారిపోయాడట.

ఎవరికంటా పడకుండా నడుస్తూ వచ్చాడుట.
పాఠకులకి తెలుసుగా, జామ్‌ఖేడ్ దగ్గరేమీ కాదు.
అరవై మైళ్ళు మెహెరాబాద్‌కి.
ఎంతసేపు నడిచాడో, ఎలా నడిచాడో పాపం వసంత్.
కాళ్ళు పుళ్ళయినాయి.
ఏడ్చి ఏడ్చి కళ్ళు కాయలైనాయి.
బాబావారు అదేమీ పట్టించుకోలేదు సరికదా,
ఈ కుర్రాడిని ఇంటి దగ్గర దింపి రండి అన్నారు.
అంతే వసంత్‌ని ఆరంగావ్ తీసుకువెళ్ళి ఇంటి దగ్గర దింపారు మండలి.
బహుశా ఆఘూ ఆలీ, అక్బరు ఆలీల కథ వసంత్‌తో పునరావృతం కాకూడదని
బాబావారీ నిర్ణయం తీసుకొని వుండవచ్చు.
ఆఘూ తండ్రి ఎన్ని సార్లు వచ్చి రచ్చ చేయలేదు.
ఇప్పుడీ వసంత్ తండ్రి కూడా వచ్చి మా పిల్లాడిని
మాకు కాకుండా చేస్తున్నారా అని రభస చేయవచ్చు.
ఇహ ఇప్పుడు ఆ అవకాశం లేదు సరికదా
తండ్రి మనస్సు మార్చుకొంటే వసంత్‌ని
మళ్ళీ బాబావారి దగ్గరకి తీసుకురావచ్చు.
చూద్దాము ఏమవుతుందో ముమ్ముందు.
తమ వెంట ఎవరు వస్తున్నారో చెప్పారు బాబావారు.
ఒక్కొక్కరు చేయాల్సిన పనులు వివరించారు.
ఆలీ ద్వయాన్ని తమ సీటు వెనుక కూర్చోమన్నారు.
రావ్ సాహెబ్‌తో తప్ప ఇంకెవ్వరితో మాట్లాడవద్దని వాళ్ళిద్దరికీ చెప్పారు.
ఈ పిల్లలకేసి చూడకండి,
వాళ్ళతో మాట్లాడకండి, అని మండలిని హెచ్చరించారు.
మీరు కూడా మండలివారికేసి చూడకండి,
మాట్లాడకండి అని ఆలీ ద్వయానికి స్పష్టం చేశారు.
వీళ్ళ బాగోగులు నీ బాధ్యత అన్నారు రావ్ సాహెబ్‌తో.
బాబా యాత్రకి రథ సారధి పాద్రి.
నీకు విష్ణు చేదోడు వాదోడుగా వుంటాడన్నారు.
ప్రయాణ కాలంలో ఏమి అవసరం వచ్చినా కొనే బాధ్యతని
బువా సాహెబ్‌పై పెట్టారు.
పోతే వంట పని ఛగన్‌ది.

ఉత్తర ప్రత్యుత్తరాల బాధ్యత ఛాన్జీ గారిది.
దారిలో ఎవరితోనైనా మాట్లాడవాల్సి వస్తే,
దారి కనుక్కోవాల్సి వస్తే, ఆ పని రమ్జూది అన్నారు బాబా.
గుస్తాద్ గారు ఎక్కడ కూర్చోవాలి?
డ్రైవర్ పక్క సీట్లో కూర్చోమన్నారు.
గుస్తాద్ గారి ప్రక్కనే అబ్దుల్లాని కూర్చోమన్నారు.
ఎక్కువ సామాన్లు బట్టలు తెచ్చుకోవద్దని అందరికీ చెప్పారు.
తలో నాలుగు బట్టలు తెచ్చుకోమన్నారు.
పరుపు చుట్ట తెచ్చుకోండి.
రాత్రి ఎక్కడయినా పడుకోవచ్చు అని బాబావారు చెప్పారు.
సిద్ధు, దస్తూర్, కరీమ్‌లని మెహెరాబాద్‌లోనే వుండమన్నారు.
తమ్ముడు జాల్‌ని కూడా వాళ్ళతో వుండమన్నారు.
బొమాన్ గారి కుటుంబాన్ని కూడా మెహెరాబాద్‌లో వుండమని చెప్పారు.
మేము తిరిగి వచ్చే వరకూ మెహెరాబాద్ వ్యవహారాలు సిద్ధూ చూస్తూ వుంటాడు.
మెహెరాబాద్‌కి మేనేజర్‌వి అతనేనన్నారు.
సిద్ధూ సంతోషించాడు.
దస్తూర్‌కి కూడా హితవు చెప్పారు.
నీ వ్రాత పని నువ్వు చేసుకో
ఎవరి పనుల్లోనూ వ్రేలు పెట్టకన్నారు.
పెసూ, హోమీలని బొంబాయి పంపారు.
మెహెరాబాద్‌కి అప్పుడే తిరిగి వచ్చిన దారా హన్సోటియాని కూడా
బొంబాయి దారి పట్టించారు.
అలా జూలై 9వ తేదీ నాటికి ప్రయాణ సన్నాహాలు ఓ కొలిక్కి వచ్చాయి.
అయితే ఇంకా బస్సు రాలేదు.
పాడ్రీ ట్రక్కు చట్రం తెచ్చాక బాబావారి అవసరాలకి వీలుగా
బస్సు బాడీ నిర్మించాలి. ఇందుకు ముహూర్తం పెట్టలేదింతవరకూ.
సరే జూలై 10వ తేదీ తెల్లవారుఝామున రెండు గంటలకి బాబావారు,
ఆయన వెంట వెళ్ళాల్సినవారు నాసిక్‌కి బయలుదేరారు.
మెహెరాబాద్‌లో బయలుదేరిన రెండు కార్లు అక్బర్ ప్రెస్ దగ్గర కాసేపు ఆగి
నాసిక్‌కేసి పరుగు తీశాయి.
అక్కడికి చేరే సరికి పదిన్నర అయింది.
స్త్రీ మండలి ఆనందానికి అవధులు లేవు.

చక్కని వంట చేశారు. భోజనం చేశాక,
బాబావారు స్త్రీమండలిని పండూలేన గుహలకి తీసుకువెళ్ళారు.
తిరిగి వచ్చాక చెప్పారు వాళ్ళతో
తాము దేశాటనకై బయలుదేరామనీ,
కాశ్మీరు వెడుతున్నామని.
జూలై 10వ తేదీ విశిష్టత పాఠకులకి తెలుసు.
ఈవాళ్టకి బాబావారు మౌనం పట్టి నాలుగేళ్ళయింది.
నాల్గవ మౌన వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుతారనుకొన్నవారికి నిరాశ ఎదురైంది.
ఈ రోజుకి ప్రత్యేక విశిష్టత లేనట్లే బాబావారు కనిపించారు.
నాసిక్‌కి వచ్చిన రెండు కార్లలో, ఒక కారుని సరోష్ నడిపాడు.
కాశ్మీరు యాత్రకు బస్సు ఏ రకంగా వుండాలో బాబా చెప్పారతనికి.
అంటే ట్రక్కు చట్రం తేవటం పాద్రీ వంతయితే బస్సుని కట్టించే బాధ్యత
సరోష్ దన్నమాట.
బస్సులో కూడా ఏకాంతంగానే వుంటామని బాబావారు సరోష్‌కి చెప్పారు.
మరి ఏకాంతవాసానికి క్యాబిన్ అవసరం.
దీన్ని డ్రైవర్ సీటు వెనక ఏర్పాటు చేయమన్నారు.
సరోష్ సరేనన్నాడు.
మీరు చెప్పినట్లు చేస్తాను అన్నాడు.
మీకు ఇబ్బంది లేకుండా కట్టిస్తాను క్యాబిన్ అన్నాడు.
చేతిలోని కెమేరాను అటూ ఇటూ ఊపుతూ.
బాబావారి దృష్టి కెమేరాపై పడింది.
ఏదీ చూడనీ అంటూ తీసుకొన్నారు.
మాటల మధ్యలో దాన్ని ఆఘా ఆలీ చేతిలో పెట్టారు.
కుర్రాడు ఆనందంలో గెంతులు వేశాడు.
బాబావారు ఎప్పుడూ ఇంతేననుకొన్నాడు సరోష్.
బాబావారి దర్శనానికి సయ్యద్ సాహెబ్, నాసిక్ వచ్చాడు.
చాలా రోజులయింది ప్రభువుని దర్శించి అతను.
బాబావారికి అతని రాక సంతోషం కల్గించింది.
ఏకాంతంగా మాట్లాడాలని వుంది బాబా అని సయ్యద్ అనడం,
ప్రభువు ఆ కోరికని మన్నించడం తృటిలో జరిగాయి.
బాబావారికి సయ్యద్ సాహెబ్ ఏమి చెప్పాడో ఏమీ అర్థించాడో
అతని కొక్కడికే తెలుసు.

ప్రభువు అతని మనోవాంఛ తీర్చినట్లు మాత్రం
చూసిన వాళ్ళకి ఇట్టే తెలిసిపోయింది.
సయ్యద్ గారి మొహంలో కనిపిస్తున్న ఆనందోత్సాహాలు
అతని మనస్సుకి అద్దం పట్టాయి.
మర్నాడు అంటే జూలై 11వ తేదీన పూనా నుంచి రమ్జూ, అబ్దుల్లా,
ఘనీ మున్సిఫ్ వచ్చారు. వస్తూనే రమ్జూ మంచం ఎక్కాడు.
ఇక్కడే వుండు ఒకటి రెండు రోజులు
నీ జ్వరం తగ్గే సరికి పాద్రీ వస్తాడు బొంబాయి నుంచి బస్సు తీసుకొని.
అతనితో కలిసి ధూలియా రమ్మని రమ్జూకి చెప్పారు బాబా.
సరేనన్నాడు అతను.
ధూలియాలో కాలేమామ వుంటున్నాడు.
ఆ ఊరి మునిసిపాలిటీలో ఇంజనీరు అంటే పెద్ద తలకాయల్లో లెక్క.
మా ఊరు రమ్మని బాబావారిని చాలా కాలంగా పిలుస్తున్నాడు.
ఇదిగో ఇప్పుడు ఈ యాత్ర పేరు చెప్పి,
కాలేమామ కోర్కె తీరే రోజు వచ్చింది.
ఇహ ధూలియాకి బయలుదేరబోతున్నామనగా
ఆఘూ ఆలీ తండ్రి వూడిపడ్డాడు.
నా కొడుకుని బాబాతో పంపనన్నాడు.
నా పిల్లాడిని నాకిచ్చేయండి.
ఇంటికి తీసుకుపోతానంటూ లొల్లి పెట్టాడు.
పాపం మండలివారికి కాలు చేయీ ఆడలేదు.
ఇప్పుడీ గొడవ ఏమిటని కంగారుపడ్డారు.
బాబావారిపై భారం వేసి,
అతగాడికి నచ్చచెప్పడానికి ప్రయత్నించారు.
అతగాడు ఓ మొండి ఘటం.
వీళ్ళ మాటని పట్టించుకొంటే కదా!
అయినా సరే మండలివారు పట్టువదలని విక్రమార్కునిలా బ్రతిమాలారు.
బామాలాడారు. చివరకు దారికి తెచ్చారు.
సరే మీ ఇష్టం.
ఇంతగా చెప్పారు కాబట్టి, కాదనలేక ఉ( అంటున్నాను. అన్నాడు అతగాడు.
మా పిల్లాడిని మీ దగ్గరే వదిలి వెడుతున్నా.
జాగ్రత్తగా చూసుకోండి అని అప్పగింతలు పెట్టి,

ఇంటి ముఖం పట్టాడు.
"హమ్మయ్య! మరో గండం గడిచింది" అని మండలివారు ఊపిరి తీసుకొన్నారు.
ఆఘూ ఆలీ తండ్రి బస్సు స్టాండుకి వెళ్ళగానే
బాబావారు స్త్రీ మండలిని ఊళ్ళోకి తీసుకువెళ్ళారు.
నాసిక్ నగరంలోని చూడదగ్గ ప్రాంతాలు చూపించారు.
స్త్రీ మండలి సంతోషించింది.
ఆ రోజు సాయంత్రం పదింటికి బాబావారి
రెండు కార్లు ధూలియా బయలుదేరాయి.
రాత్రి బస ఛండోర్ అన్న ఊళ్ళో చేశారు.
అక్కడి ధాక్ బంగళాలో రాత్రి గడిపి ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకొని
ధూలియా దారి పట్టారు.
అక్కడికి చేరే సరికి పదిన్నర అయింది.
బాబావారికి కాలేమామ ఘనస్వాగతం పలికారు.
పూలతో బాబావారిని ముంచెత్తారు.
బాబావారి దర్శనానికి ఎందరో తరలివచ్చారు.
సద్గురు శ్రీ మెహెర్‌బాబాకీ జై అంటూ
ముక్త కంఠంతో బాబావారిని ప్రస్తుతించారు.
నెమ్మదిగా కదులుతూ బాబావారి కారు కాలేమామ ఇంటికి చేరింది.
అక్కడికి అప్పటికే చాలా మంది గుమ్మిగూడారు.
దగ్గర నుంచి కొందరు,
కొంచెం దూరంగా ఇంకొందరూ బాబావారిని చూసి,
జన్మ ధన్యమయిందనిపించుకొన్నారు.
అప్పట్లో బాబావారిని సద్గురువుగానే కీర్తిస్తోంది లోకం.
అందుకనే సద్గురు మెహెర్‌బాబాకీ జై అనటం,
కొంతమంది శ్రీ మెహెర్‌బాబాకీ జై
అనటం కూడా రివాజు అప్పట్లో.
బాబావారు అవతారమూర్తి కదా,
సాక్షాత్తూ పరబ్రహ్మ పరమాత్మ కదా
మరి ఇంకా సద్గురువుగానే
ప్రజానీకం కీర్తించడమేమిటీ
అన్న ధర్మ సందేహం పాఠకులకి రావచ్చు.
అది సహజం.

పంచ సద్గురువుల పిలుపుపై దిగివచ్చి
తాము దైవీ మానవులమన్న పూర్తి ఎరుకతో వున్నా బాబావారు ఎందుకనో,
ఏమోకానీ తాము పరంధాముడినన్న సత్యాన్ని బాబావారు
వెల్లడించలేదు ఎవరితోనూ, సూచనగానూ చెప్పలేదు.
ఎక్కడా ఏ వేదికపై నుంచీ సాధికార ప్రకటన చేయలేదు.
అలా అని తాము ప్రపంచ ఆధ్యాత్మికోన్నతి కోసం,
మానవాళి సంరక్షణ కోసం
దివి నుంచి భువికి దిగి వచ్చిన దేవ దేముడు తామేనన్న సంగతిని
దాచిపెట్టనూ లేదు.
పరోక్షంగా చాలాసార్లు చెప్పారు.
ప్రత్యక్ష నారాయణుడైన సూర్యుడి మహిమనే తెలుసుకోలేని మానవాళి,
పరోక్ష ప్రస్తావనలని గ్రహించ గలదా!
అదే జరిగింది అప్పట్లో.
ఫలితం తమ మధ్య వున్న పరంధాముడిని సద్గురువుగానే కీర్తించింది లోకం.
సరే ధూలియాలో కాలేమామ
బాబావారి కోసం చక్కని ఏర్పాట్లు చేశాడు.
పండోబా, మానేకర్ తమవంతు సాయం చేశారతనికి.
బాబావారిని చాలా దగ్గర నుంచి కలిసారు.
ప్రశ్నల వర్షం కురిపించారు.
బాబావారు వారి ప్రశ్నలకి
ఓపికగా సమాధానం చెప్పారు.
వాళ్ళ ధర్మ సందేహాలని తీర్చారు.
కొత్త ఉపదేశాలు ఇవ్వలేదు
కానీ, అనేక ఆధ్యాతిక మర్మాలని చక్కగా వివరించారు.
ఇద్దరు పార్శీ వయో వృద్ధులకి బాబావారి సందేశాలు
ఎంతగానో నచ్చాయి.
ఆ ఆనందంలో బాబావారిని తమ ఇంటికి రమ్మని ఆహ్వానించారు.
మీ కోర్కె కాదంటానా అంటూ
బాబావారు వారి ఇళ్ళకి జూలై 13న వెళ్ళారు.
ఓ మార్వాడీ వ్యాపారస్థుడు ఆహ్వానిస్తే
అతనింటికీ వెళ్ళారు ఆవేళ.

**(సశేషం)**

# వివాహం

శ్రీమతి స్వర్ణ కుమారి గారి కుమారుడు చి॥ వంశీకృష్ణ వివాహం చి.ల.సౌ. హారికతో 08.2013 శనివారం ఉదయం 11.33 నిముషాలకు కె.పి.హెచ్.బి. కమర్షియల్ కాంప్లెక్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్‌లో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపినారు.

❀ ❀ ❀

శ్రీమతి గంపా జానకి, శ్రీ గంపా ఓంప్రకాష్ గార్ల కుమారుడు చి॥ స్నేహల్ వివాహము చి॥సౌ॥ హారికతో ది: 24.08.2013 శనివారం రాత్రి 2.36 నిముషాలకు కిరాణ జాగిరి మర్చెంట్ అసోసియేషన్ కళ్యాణ మండపం, కిన్నెరసాని సినిమా హాల్ ఎదురుగా, గుట్టల బజార్, ఖమ్మంలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపినారు.

# పాత శ్రీకాకుళం బాబా సెంటర్ వార్షికోత్సవం

పాత శ్రీకాకుళం బాబా సెంటర్ 21వ వార్షికోత్సవం 02.10.2013న జరుపుకుంటున్నాం. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో హాజరుకావల్సిందిగా కోరుతున్నాము.

పాత శ్రీకాకుళం అవతార్ మెహెర్‌బాబా కేంద్రము వ్యవహారిక అధ్యక్షులైన శ్రీ కె. రామారావు గారు 09.08.2013న బాబా నామస్మరణలో తన చివరి శ్వాసను విడిచిపెట్టి బాబాలో ఐక్యమైనారు.

వీరు గత 14 సంవత్సరములుగా మా కేంద్ర అధ్యక్షులుగా బాబా సేవ చేసిన ధన్యజీవి.

కాగా, నేడు వారి స్థానంలో **మెహెర్‌శ్రీ డి. శ్రీనివాసరావు గారిని** స్థానిక బాబా ప్రేమికలు ఎన్నుకున్నారని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

**– యు.వి. రమణ మూర్తి,**
**కార్యదర్శి**

# పుస్తక సమీక్ష

అవతార్ మెహెర్‌బాబాకు సంబంధించి విడుదలైన క్రొత్త పుస్తకాలు, సి.డిలను తగిన పుస్తక సమీక్ష నిమిత్తం ఎడిటర్, మెహెర్‌బాబా మాస పత్రిక, హైదరాబాద్, చిరునామాకు ప్రతినెలా 5వ తేదీలోగా అందునట్లు పంపవల్సింది.

# అవసరాలు - కోరికలు



**హైదరాబాద్ లోని కోఠి సెంటర్‌లో ఇటీవల గురుపూజ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా కుమారి పోదూరి మెహెర్‌శ్రీ మెహెర్‌బాబా వారిచ్చిన ప్రవచనం అవసరాలు - కోరికలు గురించి సావధానంగా చర్చిస్తూ ఆసక్తికరంగా ప్రసంగించింది.**

**తనకిచ్చిన కొద్దిపాటి సమయంలో బాబా సందేశం అందరికీ అర్థమయ్యేలా స్పష్టంగా వివరించింది. మెహెర్‌శ్రీ ప్రసంగ పాఠవాన్ని పాఠకులందరి కోసం ప్రచురిస్తున్నాం. దయచేసి పరిశీలించగలరు.**

❋ ❋ ❋

**అవసరాలు - కోరికలు అనే అంశంపై మెహెర్‌బాబా వారిచ్చిన ప్రవచనం** ఇలా ఉంది.

సృష్టిలోని ప్రతి ప్రాణి ఆనందంగా, సంతోషంగా ఉండాలనే కోరుకుంటుంది. మనిషి ఏ విషయంపైన దృష్టిపెట్టినా చివరికి ఆశించేది తమ సంతోషం గురించే. అధికారం, అందం, ధనం, జ్ఞానం, ఆరోగ్యం, కళలు, సాహిత్యం అన్నీ తమ సంతోష సాధన కోసమే.

ఐతే, కోరికల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం!!

మానవ చైతన్య పరిణామంతో వచ్చే సంస్కారాలే కోరికల రూపంలో వ్యక్తం అవుతాయని బాబా అన్నారు. కోరికలు రెండు రకాల ఫలితాలను ఇస్తాయన్నారు.

మానవుడు నిరంతరం ఆనందం ఆశిస్తాడు. ఐతే ఆతను ఆశించే ఆనందంతో పాటు కొన్ని బాధలు తోడవుతాయని బాబా అన్నారు.

**క్లుప్తంగా చెప్పుకోవాలంటే,**

**కోరిక అనే చెట్టు, ఆనందం, బాధ అనే రెండు పండ్లను ఇస్తుందన్నారు.**

ఒక రకం పండును ఆశిస్తే, రెండో రకం పండును కూడా ఆస్వాదించాల్సిందే!

కోర్కెల వలన అసంతృప్తి మిగులుతుంది. కోర్కెల వల్ల పొందే ఆనందం శాశ్వతమైనది కాదు. కోరికలు తీరకపోతే అసంతృప్తి మిగులుతుంది.

సాధారణంగా ఈ అసంతృప్తి అహం, కామం, లోభం, క్రోధం ద్వారా బయటకు వ్యక్తమవుతుంది. ఈ మూడు దుర్గుణాలు వాటి స్థానాలను బాబా చక్కగా వివరించారు.

**1) కామం** -ఇది భౌతిక శరీరానికి సంబంధించినదన్నారు.

రక్తమాంసాల ఆధారంగా కోరిక తీర్చుకునే ప్రయత్నం చేస్తుంది.
**2) లోభం** – ఇది హృదయానికి సంబంధించినది.
**3) క్రోధము** –ఇది మనసుకి ప్రతిరూపం.
కోర్కెలు తీరకపోవటం వల్లే కోపం వస్తుందన్నారు బాబా.
కామం స్థూలశరీరాన్ని, లోభం హృదయాన్ని, క్రోధం మనస్సుని కేంద్రం చేసుకుంటాయి.
కామం, లోభం, క్రోధం వల్లనే మనిషి తరచు అసంతృప్తికి గురౌతాడని బాబా అన్నారు.
ఏతావాతా, నిజమైన ఆనందం పొందాలంటే కోరికలు లేకపోవడమే ఉత్తమం.
ఐతే, యాంత్రికంగా కోరికలు పోగొట్టుకోవటం ఎవరికీ సాధ్యం కాదు.
మరి దీని నుండి బయట పడటం ఎలా? అని ప్రశ్నించుకుంటే,
కోరికలకు దూరంగా ఉండాలంటే జ్ఞానం ద్వారానే సాధ్యమన్నారు బాబా.
ఆనందంగా వుండటం నీ జన్మహక్కు అన్నారు బాబా.
ఇందుకు బాబా ఒక చక్కని మార్గాన్ని సూచించారు.
మనస్సులో ఏదైనా ఒక కోరిక కలగగానే కొద్ది నిముషాలు ప్రశాంతంగా
ఆలోచించమన్నారు. ఇది మనకు అవసరమా? అనవసరమా అనే విషయమై
ఓ తూరి బేరీజు వేసుకోమన్నారు.
బాబా ఒకసారి తన మండలివారికి చాక్లెట్స్ ఇచ్చి తినమన్నారు.
ఆ పిదప చాక్లెట్ రుచి ఎలా వుందన్నారు? మండలివారు చాలా బాగుందన్నారు.
కొద్దిసేపయ్యాక తిరిగి బాబా ఆ చాక్లెట్ రుచి గురించి ప్రశ్నించారు.
దాని రుచి మరచిపోయినవాళ్ళు, బాగుందని గుర్తు చేసుకుంటూ చెప్పారు.
మరి కొన్ని గంటల తర్వాత బాబా మళ్ళీ అదే ప్రశ్నను అడిగితే
మండలివారు దాని రుచి గురించి మరచిపోయినట్లు ముఖం పెట్టారు.
సుఖ దుఖాలకు, ఆనందం విషాదాలకు ఎటువంటి విలువ, ప్రాముఖ్యత
ఉండదని అవతారుడు బోధించారు. కోరికల వలననే మానవులు దు:ఖాన్ని
కొనితెచ్చుకుంటున్నారన్నారు బాబా.
మనం కోరుకున్నది జరుగకుంటే నిరాశ.
అనుకున్నది అనుకున్నట్లు జరిగితే ఇంకా ఇంకా కావలన్న ఆశ.
ఈ రెండు సందర్భాల్లో మానవులకు మిగిలేది అసంతృప్తేనన్నారు బాబా.
కోరికల నిరర్ధకత అర్ధమయితే అది మనలను జ్ఞానం వైపు తీసుకువెళ్ళి,
కోరికల నుండి విముక్తి కలిగించి, మనలను సుస్థిరమైన ఆనంద మార్గానికి చేరుస్తుందని
బాబా తన సందేశాలలో పలుమార్లు స్పష్టంగా చెప్పారు.
కోరికలు, అవసరాలు గురించి బాబా మరో చక్కని వివరణ ఇచ్చారు.
ఈ చిన్న సంగతి చెప్పి నా ప్రసంగం ముగిస్తాను.

శరీరం వున్నంతవరకు మనకు కొన్ని అవసరాలు వుంటాయి.
ఆ అవసరాలు తప్పకుండా తీర్చుకోవాలి.
కాని కోర్కెలు వ్యామోహభరితమైన ఊహవల్ల జనిస్తాయి.
ఉదాహరణకు, ఎడారిలో చిక్కుకుపోయి దాహంతో బాధపడుతున్నవానికి
కావలసింది మంచినీరు కానీ,
చల్లని నిమ్మ షర్బతు ఏమాత్రం కాదని గమనించాలి.
మెహెర్‌బాబా అవసరాలను మంచినీటితో,
కోరికలను నిమ్మ షర్బతుతో పోల్చారు.
నిజమైన సంతోష సాధనకు కోరికలు లేని జీవనం గడపటం అలవరుచుకోవాలి.
బాబా తన ప్రేమికుల అవసరాలను తీరుస్తానని భరోసా ఇచ్చారు.
ఇది మాత్రం గుర్తుంచుకుందాం!! !!!

# పాదయాత్ర
## పూనే నుండి మెహెరాబాద్ దాకా
### 2013 నవంబరు 23 నుండి 27 వరకు

పూనే సెంటర్‌ను మెహెర్‌బాబా స్వయంగా 1964 మే 1న ప్రారంభించారు.
ఆ మరుసటి సంవత్సరం మెహెర్‌బాబా పూనే సెంటర్ ప్రాంగణంలో ప్రజాదర్శనం ఇచ్చారు. నేడు పూనే బాబా సెంటర్ 50 సంవత్సరాల వేడుకలు
2014 మే 1, 2 తేదీలలో ఘనంగా జరుపుకోవాలని ప్రతిపాదించింది.
సెంటర్ స్వర్ణోత్సవాలలో భాగంగా పూనే బాబా సెంటర్ నుండి మెహెరాబాద్ వరకు - 120 కి.మీ. పాదయాత్ర నిర్వహించాలని తలపెట్టినట్లు కార్యనిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ పాదయాత్ర 2013 నవంబరు 23 నుండి 27 వరకు 5 రోజులు ఉంటుంది.
గతంలో 1994, 1999 లలో పూనే నుండి మెహెరాబాద్‌కు పూనే బాబా సెంటర్ పాదయాత్ర నిర్వహించింది.
బాబా ప్రేమికులందరూ అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనవల్సిందిగా కోరుతున్నారు. కాగా, పాదయాత్రలో పాల్గొనగోరువారు తగిన ఏర్పాట్లుకోసం ఒక్కొక్కరు రూ. 850/- చొప్పున విరాళం 2013 సెప్టెంబరు 30 లోగా చెల్లించవల్సిందిగా కోరుతున్నారు. ❀

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు, నీవు
పరబ్రహ్మవు,పరమాత్మవు
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

## పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

## మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు బాబా కొంగును చిట్టచివరి వరకు దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యత్వం

**2013 జూలై – ఆగష్టు నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 01 | సెప్టెంబర్ | ఆర్. వీరేంద్ర, కేరాఫ్: జయసూర్య, హైదరాబాద్ | రూ. 500.00 |
| | | **మొత్తం** | **రూ. 500.00** |

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/– (వెయ్యి రూపాయలు).
2. రెండు దఫాలుగా కూడా రూ. 500/– చొప్పున చెల్లించవచ్చు.
3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది.
4. వార్షిక సభ్యత్వం రూ. 100/– పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది.
5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

## మా అడ్రస్:


**ఎడిటర్,**
**మెహెర్‌బాబా,**
**గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,**
**యాప్రాల్, ప్లాట్ నెం. 32, జె.జె. నగర్ కాలనీ,**
**సికింద్రాబాద్–500087. ఫోన్: 99595–53218, 040–27860079**
**email: malladisukku@gmail.com**



Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310,
Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014,
**Dt.19-12-2011**